


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 17-12-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 94 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# విద్యతోనే భవిష్యత్తు

- టెక్ సదస్సు నిర్ణయాలను రాష్ట్రంలో అమలు చేస్తాం
- ఆంగ్ల పరిజ్ఞానం, ఐటీలో దేశంలోనే మిన్నగా ఆంధ్రప్రదేశ్
- కాగిత రహిత రాష్ట్రంగా మారనున్న పాలన
- సిలికాన్ వ్యాలీని తలపించేలా అమరావతి వ్యాలీ
- యునెస్కో సహకారంతో ఎడ్యుకేషన్ హబ్‌గా విశాఖ
- ఉపాధ్యాయులు సరిగా బోధించకపోతే పిల్లలే వారికి బోధిస్తారు

**టెక్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు**




విశాఖపట్నం : సమాజాన్ని సక్రమమైన మార్గంలో నడపడంలో విద్య కీలకపాత్ర పోషిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. నోవాటెల్‌లో శనివారం నుండి మూడురోజుల పాటు యునెస్కో, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, ఎంజిఐఇఎ సంయుక్తంగా నిర్వహిస్తున్న టెక్-2017 సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో టెక్నాలజీ పైనే దృష్టి పెట్టి రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చనున్నామని అన్నారు. మైక్రోసాఫ్ట్, గూగుల్ సిఇఓలైన సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్ ఆంధ్ర రాష్ట్రానికి చెందిన వారేనని గుర్తు చేస్తూ ప్రపంచంలో నున్న తరువాయి 2లో

# నూతన శకం ఆరంభం

- కాంగ్రెస్ పార్టీ పగ్గాలు అందుకున్న రాహుల్
- రాహుల్‌కు సోనియాగాంధీ అభినందనలు
- నెహ్రూ కుటుంబంలో పార్టీ అధ్యక్ష పదవి చేపట్టిన ఆరో వ్యక్తి
- విశేషంగా ఆకట్టుకున్న తొలి ప్రసంగం
- పార్టీ అప్పగించిన బాధ్యతలను విధేయతతో నిర్వర్తిస్తా
- ప్రధాని మోదీ దేశాన్ని మధ్యయుగానికి తీసుకెళ్తున్నారు



**కాంగ్రెస్‌ను గ్రాండ్ ఓల్డ్ యంగ్ పార్టీగా మారుస్తా - రాహుల్**

దిల్లీ: కాంగ్రెస్ పార్టీలో నూతన శకం ఆరంభమైంది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీ బాధ్యతలను స్వీకరించారు. 19 ఏళ్ల పాటు అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తించిన సోనియా గాంధీ ఆ పదవి నుంచి వైదొలిగారు. నెహ్రూ కుటుంబం నుంచి కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టిన ఆరో వ్యక్తిగా రాహుల్ నిలిచారు. అధ్యక్షుడిగా ఎన్నికైన ధ్రువీకరణ పత్రాన్ని కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల సంఘం అధ్యక్షుడు రామచంద్రన్ సోనియా సమక్షంలో రాహుల్‌కు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన తొలి ప్రసంగంలోనే బాధ్యతాయుతంగా మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలను విశేషంగా ఆకట్టుకున్నారు. భాజపా నేతలను మేము మా సోదరులు, సోదరీమణులుగా భావిస్తున్నాం. కానీ, వాళ్లు మాత్రం మాపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాళ్లు మా గొంతుకలను నొక్కేస్తుంటే.. మేము మాత్రం వాళ్లు మాట్లాడేందుకు అవకాశం ఇస్తున్నాం అని రాహుల్ పేర్కొన్నారు. వాళ్ల విమర్శలు, వ్యతిరేకతే మమ్మల్ని మరింత బలంగా మార్చాయి. కాంగ్రెస్‌ను గ్రాండ్ ఓల్డ్ యంగ్ పార్టీగా రూపుదిద్దుకునేలా చేస్తానని హామీ ఇస్తున్నా. కాంగ్రెస్ దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకొస్తుంటే.. ప్రధాని మోదీ మాత్రం మధ్యయుగానికి తీసుకెళ్తున్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను విధేయతతో నిర్వర్తిస్తానని ఆయన తెలిపారు.

ఈ వేడుకకు సోనియా కుమార్తె ప్రియాంక గాంధీ, ఆమె భర్త రాబర్ట్ వాద్రాతో పాటు మాజీ ప్రధాని మన్మోహన్, పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ సహా పలువురు సీనియర్ నేతలు రాహుల్‌ను అధ్యక్షుడిగా ప్రతిపాదిస్తూ సంతకాలు చేశారు. ఈ వేడుక సందర్భంగా ఏఐసీసీ ప్రధాన కార్యాలయమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఆ ప్రాంగణమంతా రాహుల్.. రాహుల్ నినాదాలతో తరువాయి 2లో







## ఈశాన్య రాష్ట్రాల మధ్య అనుసంధానతకు భారీ నిధులు కేటాయింపు : మోదీ

షిల్లాంగ్ : ఈశాన్య రాష్ట్రాల మధ్య అనుసంధానతను మెరుగుపరిచేందుకు భారీ నిధులను కేటాయిస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. రెండు నుంచి మూడేళ్ళలో రూ.90వేల కోట్లతో రోడ్లు, జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పశ్చిమ మేఘాలయలోని తురను షిల్లాంగ్తో కలిపే జాతీయ రహదారిని ఆయన జాతికి అంకితం చేశారు. ఇది 271 కి.మీ. పొడవైన రెండు లేన్ల జాతీయ రహదారి. బీజేపీ బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ రాబోయే రెండు, మూడేళ్ళలో స్పెషల్ తరువాయి 2లో

## 500 కి.మీ మార్క్ దాటిన ప్రజా సంకల్పయాత్ర



అనంతపురం : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర శనివారం 500 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. వైఎస్ జగన్ అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గం గొట్లూరు గ్రామానికి చేరుకోవడంతో 500 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి అయింది. ఈ సందర్భంగా ఆయన గొట్లూరులో మొక్కను నాటారు. కాగా, ప్రజల చెంతకు కాలినడకన బయల్దేరిన వైఎస్ జగన్‌కు వినతులు వెల్లువలా వస్తున్నాయి.

శనివారం వైఎస్ జగన్‌ను కలిసిన ఆర్టీసీ ఉద్యోగుల తరువాయి 2లో

## ఇండోనేషియాలో భూకంపం

ఇండోనేషియా: ఇండోనేషియాలోని జావా దీవుల్లో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా.. 65 మంది గాయపడినట్లు ఆ దేశ జాతీయ విపత్తు నిర్వహణ బృందం అధికారులు వెల్లడించారు. రాజధాని జకార్తాకు సుమారు 300 కిలోమీటర్ల దూరంలోని పశ్చిమ జావా దీవుల్లో సంభవించిన ఈ భూకంపం కారణంగా సీపాతూజా నగరంలోని పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి.

భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.5గా నమోదైనట్లు పేర్కొన్న అధికారులు.. తీర ప్రాంత ప్రజలకు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. సునామీ భయంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు.

## రిజర్వేషన్లపై మద్రాస్ హైకోర్టు సంచలన సలహా

చెన్నై : అగ్ర వర్ణాల్లోని పేదలకు కూడా విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు దక్కాలని మద్రాస్ హైకోర్టు పేర్కొంది. అగ్ర కులాలుగా చెప్పబడుతున్నవారిలో పేదలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని తరువాయి 2లో




# విద్యలో మానవీయ విలువలను పెంపొందించాలి

- ఐటీ, టెక్నాలజీ మానవ జీవితాన్ని మార్చివేస్తాయి
- లెర్నింగ్ విత్ ఫన్ విద్యాపద్ధతి రావాలి
- పరిశీలనలో ఏపి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్
- ఐటి వినియోగంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి

**కేంద్ర మానవ వనరుల శాఖామంత్రి సత్యపాల్ సింగ్**



విశాఖపట్నం: విద్యలో మానవీయ విలువల్ని పెంపొందించేలా బోధించాలని కేంద్ర మానవ వనరుల శాఖామంత్రి సత్యపాల్‌సింగ్ పిలుపునిచ్చారు. విద్యలేని వారు పశువులతో సమానమని, మానవ విలువలు లేకనే వృద్ధులైన తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపేస్తున్నారని, ఇలాంటి అమానవీయ కృత్యాలకుతావులేని విద్యను, పిల్లల్లో కరుణ, దయ పెంపొందించేలా బోధన చేయాలని అన్నారు. నాణ్యమైన విద్యనందించడంలో అనేక సవాళ్లను చూస్తున్నామని, దీనిని అధిగమించడానికి కృషి చేయాలని అన్నారు.

యునెస్కో యంజిఐఇపి డైరక్టర్ డా.అనంత దురయప్ప మాట్లాడుతూ విద్యలో మానవీయ విలువలను జోడించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బోధిస్తూ, విద్యార్థులకు ఒత్తిడి లేని చదువును అందించాలన్నారు.

విద్యాశాఖ సెక్రటరీ ఉదయలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి సదస్సు ఆసియా పసిఫిక్ దేశాల్లో ఇదే మొదటిదని, అనేక విద్యారంగ ప్రముఖులు, పరిశోధకులు, విద్యారంగ ఉపకరణాల తయారీ నిపుణులు, సాంకేతిక పరిజ్ఞాన నిపుణులు హాజరుకానున్నారని తెలిపారు. అనంతరం యునెస్కో ద్వారా అన్ని దేశాలలో ఈ సదస్సు ఫలితాలను అమలు చేసేలా చర్యలు తీసుకోవడం తరువాయి 2లో

# పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్సీ





రావులపాలెం : రావులపాలెం మండల పరిధిలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను శాసన మండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. పొడగట్లపల్లిలో శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. రోడ్లు భవనాల శాఖ ద్వారా 15 కోట్ల ఆర్‌డిఎఫ్ నిధులతో నిర్మించనున్న రాజవరం పొదలాడ రోడ్డుకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆర్ & బి శాఖ ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ కొత్తపేట నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి బాటలో నిలుపుతానని ఆయన తెలిపారు. రోడ్ల నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా నాణ్యతతో రాజీ పడకుండా అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. అభివృద్ధిలో భాగంగా జరుగుతున్న పనుల విషయాలపై ప్రతి పక్ష సభ్యులు పలు సూచనలు సలహాలు ఇవ్వాలని, అవకతవకలు, నాణ్యతా లోపాలు గుర్తించి వాటిని తమ దృష్టికి తీసుకొచ్చినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఈతకోటలో 31 లక్షలతో నిర్మించిన పంచాయితీ భవనాన్ని , 6.5 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని, 41.35 లక్షలతో నిర్మించిన హైస్కూలు తరగతి అదనపు గదులను ఆయన ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ సుమతీ ఆనందరావు అధ్యక్షతన జరిగిన సభలో పాల్గొన్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యంను దుస్సాలువాతో సత్కరించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని దశల వారీగా అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఆయన తెలిపారు. వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శనలో వరినాట్లు యంత్రాన్ని పరిశీలించి యంత్రం ద్వారా రైతులకు లాభించే విధి విధానలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వరినాట్లు యంత్రం ద్వారా సమయభావం, కూలీలు ఖర్చు తగ్గి అధిక దిగుబడులు పొందటానికి అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. అనంతరం స్వయంగా వరి నాటే యంత్రాన్ని నడిపి మెలికవులు తెలిపారు. 13 లక్షలతో నిర్మించిన కేతరాజుపల్లి గ్రామం పంచాయితీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట టిడిపి నియోజక వర్గ ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావు, డిసి ఎమ్ఎస్‌చైర్మన్ కె.వి. సత్యనారాయణరెడ్డి, ఏఎమ్‌సి చైర్మన్లు వేగేశ్న చంద్రరాజు, ఈదల నల్లబాబు, మాజీ ఏఎమ్‌సి చైర్మన్ సయ్యపరాజు జనార్ధనరాజు, గుత్తుల పట్టాభిరామారావు, కుడుపూడి శ్రీనివాస్, మేడపాటి కాసురెడ్డి, పెచ్చెట్టి చిన్నారావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రోటోకాల్ పాటించడంలేదంటూ స్థానిక శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి సభను వాకౌట్ చేసి రోడ్డుపై బైటాయించారు. ఆయన వెంట వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సిఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ జగ్గిరెడ్డికి సంఘీభావం తెలిపారు. సంఘటనా స్థలానికి రావులపాలెం ఎస్సై సిహెచ్ విద్యాసాగర్ తన సిబ్బందితో చేరుకొని పరిస్థితిని చక్కబెట్టారు.

## పూర్వవిద్యార్థులు వర్సిటీకి గర్వకారణం

### వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు

విశాఖపట్నం : పూర్వవిద్యార్థులు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా నిలుస్తారని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. శనివారం మధ్యాహ్నం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేవ మందిరంలో 1987 ఎంఏ ఆంగ్లం చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. వీరినుద్దేశించి వీసీ నాగేశ్వర రావు మాట్లాడుతూ హుదూద్ అనంతరం పూర్వ విద్యార్థుల సంఘాన్ని బలోపేతం చేయాలనే ఆలోచన అందరిలో కలిగిందన్నారు. వర్సిటీ విలువను తెలుసుకోవడం, గౌరవించడం జరుగుతోందన్నారు. అనేక మంది పూర్వవిద్యార్థులు తమవంతు సహకారాన్ని వర్సిటీకి పూర్వ విద్యార్థులు వివిధ రూపాలలో అందిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు మాట్లాడుతూ తల్లివంటి విశ్వవిద్యాలయాన్ని మరువరాదన్నారు. తమ కళాశాల రోజులను పూర్వవిద్యార్థులు గుర్తు చేసుకుంటూ ఆనందించుకునే మధురక్షణా లివన్నారు. తమ ఆలోచనలు పూర్వవిద్యార్థులు పంచుకునే వేదికగా ఇటువంటి కార్యక్రమాలు నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో పూర్వ ఆచార్యులు కె.ఎస్ చలం, ఆచార్య నిరుపరాణి, ఆచార్య లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ అనుభూతులను పంచుకుని, అతిధులను సత్కరించారు.

## ట్రైకార్ రుణాలు మంజూరు

నాతవరం : పాడేరు ఐటిడిఎ ద్వారా 2015-2016 సంవత్సరానికి 44 మంది లబ్ధిదారుల ట్రైకార్ రుణాలకు రూ.29లక్షలు మార్జిన్ మనీ మంజూరైందని నాతవరం వెలుగు ఏపిఎం ఎం.మంగ తెలిపారు. ఈ మేరకు ఆమె విలేకరులతో మాట్లాడారు. గతంలో గిరిజనులు దరఖాస్తు చేసుకున్న యూనిట్లకు పాడేరు ఐటిడిఎ నిధులు మంజూరు చేసిందన్నారు. వీటికి సంబంధించి రూ.60వేల రాయితీ మంజూరు అయిందన్నారు. లబ్ధిదారులకు వెలుగు కార్యాలయంలో అవగాహన సదుస్స నిర్వహిస్తామన్నారు. ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా చెక్కు రూపంలో రుణమొత్తాన్ని అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది స్వామినాయుడు, మణికుమార్, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

*భీమునిపట్నంలో గల శ్రీ శ్రీ శ్రీ సీతారామ లక్ష్మణ సహిత శ్రీదాస అంజనేయ స్వామి దేవాలయంలో ధనుర్మాస మహోత్సములు శనివారం ఉదయం 11.15 ని:లకు ప్రారంభమయ్యాయి ప్రతి రోజు ఉదయం 4.30 ని:లకు అష్టోత్తర శతనామార్చనలు జరుగుతాయని వంశీ మోహన చెన్న కృష్ణమాచార్యులు తెలిపారు.*

## ఉపాధి కూలీలకు గునపాల అందజేత



రావికమతం : మండలంలోని మత్సవానిపాలెం సర్పంచ్ ఆదాడ తాతాబాబు ఆధ్వర్యంలో శనివారం ఉపాధి కూలీలకు మంజూరైన 56 గునపాలు, 216 జాబ్‌కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నిరుపేదకు పని కల్పించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించిందన్నారు. అంతేకాకుండా వారికి పనిముట్లు కూడా అందించాలన్న ఉద్దేశ్యంతో పారలు, గునపాలు పంపిణీ చేస్తుం దన్నారు. ఇంకనూ జాబ్‌కార్డులు రాని వారు ఉంటే దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఆదాడ రాజేశ్వరి, వీఆర్పీ నానాజీ, పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## నూతన శకం ఆరంభం

హోరెత్తిపోయింది. టపాసులు కాలుస్తూ.. మిఠాయిలు పంచుకుంటూ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

**ఇందిర నన్ను కూతురిలా చూసుకున్నారు**

కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌గాంధీకి సోనియాగాంధీ అభినందనలు తెలిపారు. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. రాహుల్ సారథ్యంలో పార్టీ నూతనోత్తేజాన్ని పొందుతుందని, కొత్త శిఖరాలను చేరుకుంటుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరాగాంధీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

ఇందిరాగాంధీ నన్ను కూతురిలాగా చూసుకున్నారు. ఆమెను చూసి నేను చాలా నేర్చుకున్నాను. 2014 నుంచి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాం. మన రాజ్యాంగ విలువలపై దాడి చేస్తున్నారు. చాలా ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలైంది అని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వంపై పరోక్ష విమర్శలు చేశారు. దేశ సంప్రదాయాలపై దాడులు జరుగుతున్నాయని, ప్రస్తుత పరిస్థితులు భయాందోళనకర వాతావరణాన్ని సృష్టించాయని సోనియా విమర్శించారు.

## విద్యలో మానవీయ విలువలను పెంపొందించాలి

జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ రాజ్యాల విద్యాశాఖా మంత్రి అలిం అల్ కర్ణి, యునెస్కో గవర్నింగ్ బాడీ సభ్యులు రోసా తదితరులు ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మానవవనరుల శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు, పార్లమెంటు సభ్యులు కంభంపాటి హరిబాబు, అవంతి శ్రీనివాసరావు, ఆదిత్యదాస్, జె.కృష్ణకిషోర్, విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి తదితరులు హాజరైనారు.

### ఈశాన్య రాష్ట్రాల మధ్య అనుసంధానతకు భారీ నిధులు కేటాయింపు : మోదీ

యాక్సిలరేటెడ్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా రూ.60 వేల కోట్లు, భారత్ మాల పథకం క్రింద రూ.30 వేల కోట్లు పెట్టుబడులు పెడతామని చెప్పారు. ఈ నిధులతో ఈశాన్య రాష్ట్రాల్లోని జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు.

### 500 కి.మీ మార్క్ దాటిన ప్రజాసంకల్పయాత్ర

యూనియన్ నేతలు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఎన్నికలకు ముందు ఆర్టీసీ ఉద్యోగులకు చంద్రబాబు చాలా హామీలు ఇచ్చారని చెప్పారు. ఏ ఒక్క హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోలేదని తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని వైఎస్ జగన్‌కు విన్నవించారు. అంతకుముందు మల్కాపురం క్రాస్ వద్ద ధర్మవరం మైనార్టీ నేత అబ్దుల్ రవూఫ్, అనుచరులు వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

### రిజర్వేషన్లపై మద్రాస్ హైకోర్టు సంచలన సలహా

పేర్కొంది. సామాజిక న్యాయం పేరుతో నిరసన గళాలు వెల్లువెత్తు తాయన్న భయంతో వీళ్ళలో ఎవరూ మాట్లాడలేకపోతున్నారని వ్యాఖ్యానించింది. సామాజిక న్యాయం సమాజంలోని అన్ని వర్గాలకు అందాలని పేర్కొంది. అగ్ర వర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లు, సహాయం గురించి మాట్లాడటమంటే ఇతర వర్గాలు అనుభవిస్తున్న రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నట్లుగా పరిగణించరాదని తెలిపింది. అన్ని కులాల్లోనూ పేదలు ఉన్నారని, వారు విద్య, ఆర్థిక, సాంఘిక రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలని తెలిపింది. అగ్ర కులాల పేదలకు ఆర్థిక పరిస్థితుల ఆధారంగా రిజర్వేషన్లను కల్పించేందుకు కల అవకాశాలను అన్వేషించాలని ప్రభుత్వానికి సలహా ఇచ్చింది. 14 మంది విద్యార్థుల పిటిషన్‌పై జస్టిస్ కిరుబకరణ్ ఈ సలహా ఇచ్చారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఓసీ కేటగిరీకి కేటాయించిన ఎంబీబీఎస్ సీట్లను బీసీ, ఎంబీసీ కేటగిరీలకు బదిలీ చేయడం చట్టవిరుద్ధమని, అధికరణ 14ను ఉల్లంఘించడమేనని ప్రకటించాలని హైకోర్టును ఈ విద్యార్థులు కోరారు.

# విద్యతోనే భవిష్యత్తు






మొదటి పేజీ తరువాయి

పదిమంది ఐటి ఉద్యోగుల్లో భాతరదేశం నుండి నలుగురు వుంటే అందులో ఒకరు ఆంధ్రప్రదేశ్ వారే కావడం గర్వంగా వుందన్నారు. ఒకప్పుడు సిలికాన్ వ్యాలీకి యువత దారి తీసేవారని, ఇకపై అమరావతి వ్యాలీ రూపుదిద్దుకుంటోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ హబ్‌గా మార్చాలన్నాదే తన లక్ష్యమని, 2022 నాటికి భారతదేశంలో టాప్ 3లోనూ, 2029 నాటికి భారత్‌లోనే ప్రధమంగానూ నిలపాలని, 2050 నాటికి ప్రపంచంలోనే ఉత్తమ గ్లోబల్ డెస్టినేషన్‌గా నిలపాలని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి ఫైబర్‌నెట్ వర్కింగ్ ద్వారా 200 రూపాయలకే ఇంటర్నెట్, వైఫై తదితర కనెక్టివిటీని అందిస్తున్నామని దీనికోసం 320 కోట్ల రూపాయలను ఖర్చు చేయడం జరిగిందని అన్నారు. త్వరలోనే 1400 మిలియన్ ప్రజలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంటినుండే తనతో మాట్లాడే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు.

నాణ్యమైన విద్య ద్వారానే మానవ విలువలను పెంపొందించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు సక్రమ బోధన చేయాలని, అలా చేయని నాడు పిల్లలే ఉపాధ్యాయులకు బోధిస్తారని అన్నారు. యునెస్కో ఆధ్వర్యంలో విద్యాహబ్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా వుందని అన్నారు.





# 'ఈ-వీసా' ప్రారంభించిన ముఖ్యమంత్రి

### - 25వ కేంద్రంగా విశాఖపట్నంలో

### - 162 దేశాలకు సంబంధించి వీసాను పొందవచ్చు



విశాఖపట్నం: విశాఖ విమానాశ్రయంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఈ-వీసా సౌకర్యాన్ని శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా ఆన్‌లైన్‌లో వీసా పొందవచ్చు. ఇటువంటి కేంద్రాలు భారతదేశంలో 24 వుండగా 25వ కేంద్రంగా విశాఖపట్నంలో ఏర్పాటు చేశారు. ప్రపంచంలోని 162 దేశాలకు సంబంధించి వీసాను ఈ కేంద్రం ద్వారా పొందవచ్చును.

ఈ కార్యక్రమంలో మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలం భవాని, పార్లమెంటు సభ్యులు కె.హరిబాబు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ మంత్రి కిమిడి మృణాళిని, జిల్లా కలెక్టరు ప్రవీణ్‌కుమార్, పోలీసు కమిషనరు టి.యోగానంద్, శాసన మండలి సభ్యులు పప్పల చలపతిరావు, గాదె శ్రీనివాసులు నాయుడు, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, వాసుపల్లి గణేష్‌కు మార్, పల్లా శ్రీనివాసరావు, పివిజిఆర్.నాయుడు, పీలా గోవింద సత్యనారాయణ, వంగలపూడి అనిత, బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



# బ్యాంకర్లు కస్టమర్లకు విశ్వాసం, భద్రత, భరోసా కల్పించాలి

- టెక్నాలజీని వినియోగిస్తూ రియల్ టైమ్ సేవలను అందజేయాలి
- సమాజ సంక్షేమం, అభివృద్ధి కోసం సిఎస్ఆర్ నిధులు వెచ్చించాలి
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు





విశాఖపట్నం: కస్టమర్లకు విశ్వాసం, భద్రత, భరోసా కల్పించేలా బ్యాంకర్లు వ్యవహరిం చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు నిచ్చారు. శనివారం విశాఖపట్నం నగర పరిధిలోనున్న పోతులవల్లయ్యంలోని వైజాగ్ కన్వెన్షన్‌లో నిర్వహించిన కరూర్ వైశ్యాబ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సమాజ అభివృద్ధి, సంక్షేమంలో కీలక పాత్ర పోషించే బ్యాంకర్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించు కుంటూ కస్టమర్లకు రియల్ టైమ్ సేవలు అందజేయాలని ఆయన కోరారు.

కస్లమర్ల డిపాజిట్లకు భద్రత, భరోసా కల్పించాలని, బ్యాంకు సేవలపై కస్టమర్లలో విశ్వాసం కలిగే విధంగా రియల్ టైం సేవలను అందజేయాలన్నారు. కరూర్ వైశ్యాబ్యాంకు సిఎస్ఆర్ నిధులు రూ.1.00కోటిని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయడంపై ముఖ్యమంత్రి అభినందనలు తెలుపుతూ సమాజ అభివృద్ధి, సంక్షేమానికై బ్యాంకులు, పరిశ్రమలు సిఎస్ఆర్ నిధులను పెద్ద ఎత్తున వెచ్చించాలన్నారు.

ఎక్కువగా ఉద్యోగాల కల్ప, సంపద అభివృద్ధికై టెక్నాలజీని వినియోగించడం జరుగుచున్నదని, అయితే సామాన్య ప్రజలకు సత్వరమైన రియల్ టైమ్ సేవలు అందజేసేందుకు టెక్నాలజీని రాష్ట్రంలో పెద్దఎత్తున అమల్లోకి తెస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో చిత్తూరు జిల్లాలో తొలి బ్రాంచ్‌ని స్థాపించి నేడు 112 బ్రాంచ్‌ల వరకు విస్తరించడం కస్టమర్ల విశ్వాసానికి, భరోసాకు ఇది నిదర్శనమన్నారు.

కరూర్ వైశ్యాబ్యాంక్ డైరక్టర్ ఎ.జె.సూర్యనారాయణ మాట్లాడుతూ లక్షా 20వేల పెట్టుబడితో ప్రారంభమైన బ్యాంకు నేడు లక్ష కోట్ల టర్నోవర్‌కు చేరుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా 1972లో చిత్తూరు జిల్లాలో తమ బ్రాంచ్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు.

కరూర్ వైశ్యాబ్యాంక్ ఛైర్మన్ బి.స్వామినాథన్, మేనేజింగ్ డైరక్టర్ అండ్ సిఇఓ పి.ఆర్.శేషాద్రి తదితరులు మాట్లాడుతూ తమ బ్యాంకు దేశవ్యాప్తంగా అందజేస్తున్న సేవలను వివరించారు.

రాష్ట్రమంత్రులు గంటా శ్రీనివాసరావు, శిద్దా రాఘవరావు, విశాఖ పార్లమెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, కరూర్ వైశ్యాబ్యాంక్ అధికారులు రాజశేఖర్, శ్రీనివాసమూర్తి, ప్రభురాజ్ తదితరులతో పాటు ఖాతాదారులు, వ్యాపార భాగస్వాములు, షేర్ హోల్డర్లు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొన్నారు.




# మానవీయ విలువలతో బోధన వుండాలి



విశాఖపట్నం : విద్య అంటే విషయ పరిజ్ఞానం ఒక్కటే కాదని అందులో మానవీయ కోణం కూడా ఉండాలని వక్తలు పేర్కొన్నారు. వన్డేల్లో జరుగుతున్న వషిష్ట సదస్సులో భాగంగా we donµt need no education అనే అంశంపై ముందుగా యునెస్కో డైరక్టర్ ఆనంద కె దురై ప్రారంభోపన్యాసం ఇస్తూ విద్య అనేది శాంతి సౌభ్రాతృత్వం పెంపొందిస్తూ మానవాళికి ఉపయోగకరంగా ఉండాలన్నారు ప్రపంచానికి మానవీయ విలువలను నేర్పిస్తూ అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించేలా నిదేశం చేస్తుండా లన్నారు బాలలకు కూడా మానసిక స్థైర్యాన్ని కలిగిస్తూ విద్య పట్ల ఆకర్షణ కలిగేలా వారి భవిష్యత్తును తీర్చిదిద్దేలా చదువు చెప్పాలన్నారు ఈ విధంగా వివరించింది అనుభూతి జ్ఞానము తార్కికత పోలిక మూల సూత్రాలు గా బోధన జరగాలన్నారు విద్యార్థు లకు క్రమశిక్షణ మూర్తిమత్వం మానవీయ విలువలు నేర్పడంలో ప్రధానో పాధ్యాయుడు పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు ఎటువంటి ఒత్తిడి లేకుండా ఆడుతూ పాడుతూ నూతన అంశాలను తెలుసుకోవడం కలిసికట్టుగా కొత్త ఆలోచనలతో ఆవిష్కరణలు చేయడం నేర్పించాలన్నారు. చర్చలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ నూతన సాంకేతికత మూలంగా ఎన్నో లాభాలు కలుగుతున్నాయని అయితే నష్టాలు కూడా ఉంటున్నాయన్నారు. సానుకూల మైన అంశాలను గ్రహించి చెడును దూరంగా ఉంచాలన్నారు. నేటి యువతరంలో అనూహ్య మైన, వేగవంతమైన మార్పులు చోటు చేసు కుంటున్నాయని వాటిని సక్రమ మార్గంలో నడిపించేందుకు గురువులు కామన్ సెన్స్ ఉపయోగించాలన్నా రు. సునిశిత పరిజ్ఞానం గల యువత ఒకచోట చేరినట్లయితే అద్భుతమైన ఆవిష్కరణలు, ఆలోచనలు వస్తాయని పేర్కొన్నారు. వాటిని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించుకోవడం లోనే గురువుల స్ఫూర్తి ఉపయోగపడాలన్న విద్యార్థుల ఆలోచనా విధానాన్ని పద్ధతులను ప్రగతిపథంలో పయనింప జేసే వారిని విజేతలుగా తీర్చిదిద్దా లన్నారు. రాశి కన్నా వాసిగల విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు సూక్ష్మ గ్రహణ, ధైర్యంగా బదులు చెప్పడం నేర్పించాలన్నారు. స్వేచ్ఛ సమానత్వం మానవ హక్కులు జాతీయ భావాలు మొదలైనవన్నీ ఉన్నత విద్యా సంస్థలలోనే రూపు దిద్దు కుంటాయి అన్నారు. ఎక్కువ జనాభా కలిగిన భారత వంటి దేశాలలో తరగతి గదిలో ఎక్కువ మంది విద్యార్థులను కూర్చోబెట్టి విపులంగా వివరించడం కష్టంగా ఉంటుం దన్నారు. ప్రయోగాత్మక విద్యను అందిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఇటీవల కాలంలో విద్య స్వరూప స్వభావాలు వేగంగా మారిపోతు న్నాయని పోటీతత్వం వృద్ధి చెందుతున్న దని అన్నారు. వాటిని అంది పుచ్చుకున్న ప్పుడే విద్యారంగంలో అభివృద్ధి సాధ్యపడుతుంద న్నారు.

ఈ చర్చలో సుజాత మిత్రా, బాసంతి ముఖర్జీ, జోర్డన్ షాపిరో, టోనీ బ్రాండెన్‌బర్గ్, వెరా కౌరీ, లాక్యూహీ పాల్గొన్నారు. సభ్యులు అడిగిన ప్రశ్న లకు సమాధానాలు ఇచ్చారు.

# జియాలజీలో విజయలక్ష్మికి డాక్టరేట్

ఏయూ : ఆంధ్రవిశ్వవిద్యాలయం జియాలజీ విభాగ పరిశోధక విద్యార్థిని బొబ్బాది విజయ లక్ష్మికి వర్సిటీ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు కె.సత్యనారాయణ రెడ్డి పర్య వేక్షణలో 'ఈశాన్య సముద్ర తీర ప్రాంతం, ఆంధ్రప్రదేశ్‌లోని పూడిమడక నుంచి బంగారమ్మ పాలెం వరకు గల సముద్ర తీర ప్రాంత ఇసుకలో గల భార ఖనిజాలు, వాటి పారిశ్రామిక ఉత్పాదక అనుకూలత' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ ప్రాంతాలలో లభించే గార్నెట్, సిల్లీమనైట్ మరియు ఇల్మనైట్ ఖనిజాల లభ్యత, విస్తరణ, సాంద్రతలను తన పరిశోధ నలో వివరించారు. గార్నెట్ ఖనిజం అబ్రాజివ్‌గా, ఫైన్ పాలిషింగ్‌లో వినియోగిస్తారు.

# సర్వమత సారమే భారతీయత


కేక్ కట్‌చేస్తున్న వీసీ జి.నాగేశ్వర రావు

ఆంధ్రాయూనివర్శిటీ : అన్ని మతాలలో ఉన్న మంచిని గ్రహించడమే భారతీయతని ఆంధ్రవిశ్వ విద్యాలయం వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. ఏయూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అసెంబ్లీ మందిరంలో నిర్వహించిన యూత్ రిట్రీట్ అండ్ సెమీ క్రిస్మస్ 2017 వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతికి ప్రతిరూపంగా ఏసుక్రీస్తు నిలుస్తారన్నారు. మనిషి జీవించే విధానాన్ని ఏసుక్రీస్తు మనకు చూపారన్నారు. వర్సిటీలో ప్రతీ సంవత్సరం విద్యార్థులు క్రిస్మస్‌వేడుకలను కలసి జరుపుకోవడం మంచి పరిణామమన్నారు. సమాజంలో సానుకూల ఆలోచనలను, సామరస్యాన్ని పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

వర్సిటీ రెక్టార్ ఆచార్య కె.గాయిత్రీ దేవి మాట్లాడుతూ వసుదైక కుటుంబకం అన్న విధంగా వర్సిటీలో విద్యార్థులు అన్ని పండుగలను కలసి జరుపుకోవడం మంచి పరిణామమన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు ముందుగా విద్యార్థులకు, పరిశోధకులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియ జేశారు. ఇతరులకు సేవ చేయడం, నమ్మకానికి నిదర్శనంగా ఏసు కీస్తు జీవితం నిలుస్తుందన్నారు. ఆయన చెప్పిన మంచిని ఆచరిస్తూ ముందుకు సాగాలన్నారు. విద్యార్థుల మధ్య సత్సం బంధాలకు, ఐక్యతకు చిహ్నంగా ఇటువంటి పండుగలు నిలుస్తాయన్నారు.క్రిస్మస్ వేడుకల్లో భాగంగా క్రీస్తు సువార్త, క్రీస్తు జన్మదినం సంబంధించిన విశేషాలను పాస్టర్ జార్జ్ సంబతిని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ టి.షారోన్ రాజు, ఆచార్య జి.జయశంకర్, ఆచార్య పి.జగదీశ్వర రావు, ఆచార్య పాల్ డగ్లస్, పిడిఎఫ్ పరిశోధకులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యున్నత పరిజ్ఞానంతో విద్యాబోధన

## యునెస్కో ప్రతినిధి నందిని చటర్జీసింగ్



విశాఖపట్నం: అత్యున్నత పరిజ్ఞానంతో విద్యాబోధన చేస్తే విద్యార్థుగ్రాహక శక్తి పెరుగుతుందని యునెస్కో ప్రతినిధి నందిని చటర్జీ సింగ్ అన్నారు. శనివారం స్థానిక నొవొటెల్‌లో నిర్వహించిన టెక్ 2017లో భాగంగా రెండవ సెషన్‌లో విద్యాప్రమాణాలపై ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి సామార్థ్యాన్ని బట్టి బోధన జరగాలన్నారు. అక్షర ధ్వనిలో మార్పులపై పిల్లలకు సామర్థ్యాన్ని బట్టి బోధన జరగాలన్నారు. అక్షర ధ్వనిలో మార్పులపై పిల్లలకు అవగాహన కలిగి వుండాలని చెప్పారు. భారతీయ భాషలలో అక్షరాల ఉచ్ఛారణ ఒకే విధంగా వుంటుందన్నారు. ఆంగ్ల అక్షరాల ఉచ్ఛారణ ప్రాంతాల వారిగా విభిన్నంగా పలుకుతారని చెప్పారు. 5 నుండి 7 సంవత్స రాల వయస్సు కలిగిన విద్యార్థులు అక్షరాలు పలకడంలో ఇబ్బందులు పడుతుంటారని చెప్పారు. ధ్వని, అక్షర అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. పెద్ద పదాలను చెప్పడంలో చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతుంటారని, సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. ఏదైనా పనిలో శ్రద్ధ, ఏకాగ్రత చూపించకపోవడం వలన విద్యార్థి తొందరగా విసుగు చెందుతుంటారని అటువంటి విద్యార్థులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. 8 నుండి 10 సంవత్సరాల వయస్సు గల పిల్లలపై మాధ్యమిక పర్యవేక్షణ ఉపకరణం వాడుతూ విద్యార్థి సామర్థ్యాన్ని మిగతా విద్యార్థులతో పోల్చి వివరించాలని చెప్పా. విద్యార్థి గృహ మరియు సాంఘిక పరిసరాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మైఖేల్ హార్ట్, ప్రియాంకా సాటిలం, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



అచ్యుతాపురం: ఉచిత వైద్య శిభిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్‌పిపి చేకూరి శ్రీనివాసరాజు అన్నారు. శనివారం మండల కేంద్రమైన అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టార్ హెల్త్ ఇన్సురెన్స్ ఉమ్మడిగా ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. ఈ వైద్య శిభిరంలో పాల్గొన్న ఎమ్‌పిపి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ఉచిత వైద్య శిభిరాలు నిర్వహించడం అభినంద నీయమన్నారు. ఈ వైద్య శిభిరంలో వైద్యులు సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా పెర్శనల్ చీఫ్ టిఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ ఇండియా 10వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఉచిత వైద్య శిభిరం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్ పి.శోభా రాణి, స్టార్ హెల్త్ డివిజనల్ మేనేజర్ కె.సత్యనారాయణ, కేర్ హాస్పిటల్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గౌరీపరమేశ్వరులను దర్శించుకున్న ప్రముఖులు

అనకాపల్లి : పట్టణంలో చిననాలుగురోడ్ల జంక్షన్‌లో గల కుంచావారి శ్రీ గౌరీ పరమేశ్వరులను ఉత్సవం సందర్భంగా శనివారం ప్రముఖులు దర్సించుకున్నారు. వీరిలో మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్య పీలా గోవిందసత్యనారాయణ, ఎంపి ముత్తంశెట్టి మహేష్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, బీమిలి ఇన్‌చార్జ్ పరుచూరి భాస్కరరావు, తెలుగుదేశం పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు మళ్ల సురేంద్ర, బుదిరెడ్డి చిన్న, పట్టణ సిఐ ఎస్. విద్యాసాగర్ గౌరీపరమేశ్వరులని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వీరికి ఆలయ నిర్వాహకులు పూర్ణ కంభంతో స్వాగతం పలికారు.



# ఘనంగా ముగిసిన గీతం యువజనోత్సవం

జెమ్ 2017లో అధిక సంఖ్యలో పాల్గోన్న విద్యార్థులు



విశాఖపట్నం : గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం వేదికగా జాతీయ స్థాయి లో నిర్వహిస్తున్న గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్-2017) శనివారం వంద లాది మంది విద్యార్థుల మధ్య ఘనంగా ముగిసింది. గీతం విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు నిర్వాహకులుగా మారి నిర్వ హిస్తున్న ఈ ఉత్సవాన్ని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షీలా, జెమ్ కన్వీనర్ డాక్టర్ వై.వి.వి.ఎస్.వరప్రసాద్, కో కన్వీనర్ డాక్టర్ పి.ఆషా, సిఇఓ స్టాన్లీ ఎమరాల్డ్ తదితరులు ఘనంగా నిర్యహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సింగర్ ఎమ్.ఎమ్. శ్రీలేక, అర్జుణరెడ్డి సినిమా డైరక్టర్ సందీప్ రెడ్డి వంగ, ప్రతేక ఆకర్షణగా నిలిచారు. రెండు రోజుల పాటు జరిగే ఈ యువజనోత్సవంలో భాగంగా మొదటి రోజునమరియు రెండువ రోజన విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.మేక్ యువర్ ప్రొడక్ట్, మిషన్ ఇంపాజిబుల్, బజ్ వర్డ్స్, గీతం గాట్ టాలెంట్ పోటీలలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులను స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సహించేందుకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పేరిట వర్క్‌షాప్‌ను, విద్యార్థులలో ఫొటోగ్రఫీ పై అవగాహన కలిగించే వర్క్‌షాప్‌ను, షార్ట్ ఫిలిమ్ తయారి వర్క్‌షాప్‌లను నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన విద్యార్థులతో గీతం విశ్వవిద్యాలయం ప్రాంగణం కిటకిటలాడింది. విద్యార్థులను ఆకర్షించేందుకు గీతం మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఫేస్ పెయింటింగ్, ఫ్యాన్సీ డ్రస్, ఫేస్ మాస్క్‌లతో ఉత్సవ వేదిక వద్ద తిరుగుతూ ఆకట్టుకున్నారు.

జెమ్ యువజనోత్సవంలో భాగంగా విశ్వవిద్యాలయం ఆవరణలోని బాలయోగి కళా ప్రాంగణంలో శనివారం సాయంత్రం నిర్వహించిన రెండువ రోజు సాంస్కృతిక ఉత్సవాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యా ర్థులు బృందగానాలు, పాశ్చాత్య నృత్యాలతో ఆహూతులను అలరించారు.

## బాస్కెట్‌బాల్ సర్టిఫికేట్ కోర్సుకు యలమంచిలి క్రీడాకారులు

యలమంచిలి రూరల్ : సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ప్రగడ సాయిరాం ఎన్ఐఎస్ సర్టిఫికేట్ కోర్సుకు ఎంపికయ్యాడు. యలమంచిలి బాస్కెట్ బాల్ క్లబ్‌లో మంచి ఆటగాడిగా పేరు పొందిన సాయిరాంను జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సాయిరాంకు తమిళనాడులోని కాంచీపురం ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో శిక్షణ పొందేందుకు అనుమతి పత్రం అందింది. క్రీడాకారుడు సాయిరాంకు శిక్షణకు చెల్లించాల్సిన రూ.19వేల ఫీజును జిల్లా అసోసియేష్ అందజేసింది. ఈ సందర్భంగా యలమంచిలి బాస్కెట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు ద్వారపురెడ్డి గణేష్, మాడెం ప్రసాద్ సాయిరాంను అభినందించారు.

# విజయభాను సంపాదకీయం

## ఇప్పటికీ పట్టు చిక్కలేదు

కాంగ్రెస్ పార్టీకి పందొమ్మిదేండ్లు సారథ్యం వహించిన సోనియా గాంధీ- తనయుడు రాహు ల్ గాంధీ పార్టీ అధ్యక్ష పదవి స్వీకరిస్తున్న నేపథ్యంలో- ఇక వైదొలుగడమే తన పని అని చెప్పారు. సోనియా వైదొలుగుతున్నారనే మాట సంచలన వార్తగా మారిపోయింది. కానీ ఆ వెంటనే సోనియా పార్టీ పగ్గాలు వీడుతున్నారే తప్ప, క్రియాశీల రాజకీయాల నుంచి నిష్క్రమించడం లేదనే వివరణ పార్టీ వర్గాల నుంచి వెలువడింది. స్వాతంత్ర్యానికి ముందు మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూతో సహా అనేకమంది అతిరథ మహారథులు కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహించారు. భారత గణతంత్రం అవతరించిన తర్వాత మాత్రం క్రమంగా కాంగ్రెస్ పార్టీ నెహ్రూ కుటుంబం చేతిలోకి పోయిందనేది వాస్తవం. ప్రధాని ఇందిరా గాంధీ కోడలుగా, ప్రధాని రాజీవ్ గాంధీ భార్యగా ఆమె రాజకీయాల్లో తలదూర్చకుండా తన పరిధిలోనే ఉండేవారు. కానీ రాజీవ్ గాంధీ హత్య జరిగిన తర్వాత సోనియా రాజకీయ ప్రవేశానికి అనుకూల పరిస్థితి ఉన్నప్పటికీ, ఆమె అనాసక్తి ప్రదర్శించారు. కానీ ఆమె ఎంతోకాలం ఆ నిర్లిప్తతతో లేరు. కాంగ్రెస్ పార్టీని సంక్షోభం నుంచి గట్టెక్కించి, అంతిమంగా రాహుల్‌గాంధీకి పట్టంకట్టే వరకు తాను అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించారు. పందొమ్మిదేండ్ల కిందట ఈ కాంగ్రెస్ పార్టీ సారథ్య బాధ్యతలు స్వీకరించినప్పుడు సోనియా ఇంతకాలం కొనసాగుతానని ఊహించారా అనేది సందేహమే. రాహుల్ గాంధీలో నాయకత్వ లక్షణాలు కొరవడటంతో సోనియాపై నాయకత్వ భారం కొనసాగింది. గతంతో పోలిస్తే రాహుల్ గాంధీ రాజకీయాలకు కొంత అలవాటు పడినట్టు కనిపిస్తున్నారు.

రాహుల్‌గాంధీ పార్టీ అధ్యక్ష బాధ్యతలను శనివారం స్వీకరిస్తున్న నేపథ్యంలో సోనియా తాను వైదొలుగుతున్న సూచనలిచ్చారు. కానీ సోనియా క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలుగుతారనేది రాజకీయ పరిశీలకులు నమ్మలేకపోతున్నారు. దీనికి కారణం రాహుల్ గాంధీ ఇంకా సోని యా సలహాలు, సూచనలు లేకుండా నెట్టుకురాగలుగుతారనే నమ్మకం లేకపోవడం వల్లనే. సోనియా ఇప్పటికీ పార్లమెంటరీ పార్టీ నాయకురాలిగా ఉన్నారు. రాజకీయాల్లో రాహుల్ ఇప్పటికీ పట్టు చిక్కలేదు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు కూడగట్టాలం టే, ఇతర పక్షాలతో సంప్రదింపులు జరిపే ఉన్నత స్థాయి సోనియాకు ఉన్నదే తప్ప రాహుల్‌కు కానీ, మరే సీనియర్ పార్టీ నేతకు కానీ లేదు. సోనియా ఈ స్థాయిని సాధించుకోవడం వెనుక ఆమె సాగించిన కృషి ఉన్నది. రాజీవ్ హత్య జరిగిన తర్వాత మూడేండ్లకు సోనియా పార్టీ నాయకత్వ బాధ్యతలు స్వీకరించినప్పటికీ, అది అంత సులభంగా సాధ్యపడలేదు. రాజీవ్ హతులైన వెంటనే ఆమె నాయకత్వానికి అనుకూల పరిస్థితి ఉన్నప్పటికీ, ఆ తర్వాత మూడేండ్లలో పరిస్థితి మారిపోయింది. పీవీ వంటి రాజకీయ ఉద్దండుడు ప్రధానిగా ఉన్నప్పుడు సోనియా ప్రభావం నిర్వీర్యం కావడం మొదలైంది. ప్రతికూల పరిస్థితుల్లో ఎదురీది, చివరికి పార్టీ నాయకత్వాన్ని దక్కించుకున్నారు. 1999 లో కూడా కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం తర్వాత, కార్యకర్తలకు పార్టీ భవిష్యత్తు పట్ల ఆశలు సన్నగిల్లాయి. ఈ స్థితిలో కాంగ్రెస్ పార్టీని 2004లో గెలిపించారు. దశాబ్దం పాటు మళ్ళా కాంగ్రెస్ పాలన సాగిందంటే సోనియా రాజకీయ చతురతే కారణం. అధికారంలో ఉన్నా, లేకున్నా కాంగ్రెస్‌తో పాటు, లౌకిక పక్ష రాజకీయాలకు సోనియా కేంద్ర బిందువు కాగలిగారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పటికీ, జాతీయ సలహా మండలి ద్వారా అనేక ప్రగతిశీల చట్టాలు చేయించగలిగారు. జాతీయ ఉపాధి పథకం, సమాచార హక్కు, విద్యా హక్కు, ఆహార భద్రత, సామాజిక భద్రత మొదలైన చట్టాలు చేయడం వెనుక సోనియా ప్రోద్బలం ఉన్నదనవచ్చు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను కూడా సోనియా అర్థం చేసుకున్నారనే భావన ఇక్కడి ప్రజలకు ఉన్నది. రాహుల్‌కు నాయకత్వం అప్పగించినప్పటికీ, పార్టీ అనేక బలహీనతలతో కొట్టుమిట్టాడుతున్నది. రాష్ట్రాల శాఖలు జవసత్వాలను కోల్పోయాయి. ప్రాంతీయ పార్టీలు బలపడుతున్నాయి. పార్టీని చక్కదిద్దే పరిణతి రాహుల్‌లో కనిపించడం లేదు. ప్రస్తుత పరిస్థితి ఎట్లా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి మరెవరూ లేనంత సుదీర్ఘకాలం అధ్యక్షురాలిగా ఉండి, పార్టీని రెండుసార్లు అధికారానికి తెచ్చిన ఘనత సోనియాకు దక్కుతుంది.

తెలంగాణ ప్రజల ఆకాంక్షను కూడా సోనియా అర్థం చేసుకున్నారనే భావన ఇక్కడి ప్రజలకు ఉన్నది. కానీ 2004లో అధికారానికి వచ్చిన వెంటనే, లేదా కేసీఆర్ నిరాహార దీక్ష పట్టినప్పుడే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయవలసింది. కానీ సుదీర్ఘ పోరాటం చేయవలసి రావడంతో, ఆ ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కలేదు.

## చమ్మచింత సంఘటనకి విచారణ తీరే కారణం

### దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి అప్పలరాజు

నర్సీపట్నం : చమ్మచింత సంఘటనలో పోలీసుల ముందే యువతి ఆత్మహత్యయత్నానికి పోలీసులు విచారణ తీరే ప్రధాన కారణమని దళిత హక్కుల పోరాట సమితి(డిహెచ్‌పిఎస్) జిల్లా సహాయ కార్యదర్శి ఎం.అప్పలరాజు ఆరోపించారు. శనివారం డిహెచ్‌పిఎస్ ప్రతినిధులు గ్రామాన్ని సందర్శించారన్నారు. రెండేళ్ల మధ్య స్థల సమస్య విషయంలో పోలీసులు పంచాయతీ పెట్టడం వలన బాధితులు ఆత్మన్యూనతకు లోనై ఆత్మహత్య ప్రయత్నం చేసి ఉంటారన్నారు. పోలీసులను బాధితుడైన పోదుకు ప్రసాద్, అగౌరవపరచాడని అందరి సమక్షంలో పోలీసులు కొట్టడం, జీపు ఎక్కించేందుకు ప్రయత్నించడం జీర్ణించుకోలేని ప్రసాద్ చెల్లెలు భవానీ ఆత్మహత్యకు పాల్పడటానికి పోలీసులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో విచారణకు వెళ్లిన వారు పంచాయతీ పెట్టడం వలనే తమకు అన్యాయం జరుగుతుండేమో అన్న భావన ఏర్పడి ప్రసాద్ అలా వ్యవహరించి ఉండ వచ్చన్నారు. బహిరంగ విచా రణ పేరుతో ప్రజా ప్రతి నిధులు, గ్రామ పెద్దలతో కలిసి తగవు తీర్చేందుకు ప్రయత్నించడం వల్లనే ఇలా జరిగిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. గత ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కానీ ఈ తగవు(నివిల్‌వేటరు) కోర్టుకి వెళ్లకుండా గ్రామంలో కూర్చోని సెటిల్ చేయడానికి ప్రయత్నించడమే ప్రధాన కారణమని ఆరోపించారు. సంఘటన తీరుకు పోలీసులే ప్రధన బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.



డిహెచ్‌పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.అప్పలరాజు

## చంద్రన్న క్రిస్మస్, సంక్రాంతి కానుకల పంపిణీకి ఏర్పాట్లు

**- 21 నుండి క్రిస్మస్ కానుకల పంపిణీ, 7.01 లక్షల కుటుంబాలకు కానుకలు**

**- జాయింట్ కలెక్టర్ శ్రీకేష్ లత్కర్**



విజయనగరం : జిల్లాలో నిరుపేద కుటుంబాలకు క్రిస్మస్, సంక్రాంతి పండుగల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న చంద్రన్న కానుకల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీకేష్ లత్కర్ బాలాజీ చెప్పారు. జిల్లాలో 7లక్షల ఒక వెయ్యి నిరుపేద కుటుంబాలకు ఈ కానుకలు అందించనున్నట్లు పేర్కొన్నారు. చంద్రన్న క్రిస్మస్ కానుకలను డిశంబరు 21 నుండి జిల్లాలోని రేషన్ షాపుల ద్వారా పంపిణీ సిద్ధం చేశామన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబరులో జాయింట్ కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ కానుకల పంపిణీకి చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. కానుక కింద జిల్లా వ్యాప్తంగా నిరుపేద కుటుంబాలకు రూ.15.78 కోట్ల విలువైన ఆరు రకాల నిత్యావసర సరుకులు అందజేయనున్నామని వెల్లడించారు. ఒక్కో కుటుంబానికి రూ.225 విలువచేసే అరకిలో కందిపప్పు, అరకిలో పామాయిల్, అరకిలో శనగపప్పు, కిలో గోధుమపిండి, వంద గ్రాముల నెయ్యి, అరకిలో బెల్లం తదితర ఆరు సరుకులను అందజేస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో కందిపప్పు, బెల్లం, శనగపప్పు 350.92 మెట్రిక్ టన్నులు వంతున, పామాయిల్, నెయ్యి 7.01 లక్షల ప్యాకెట్లు వంతున, గోధుమలు 701.80 మెట్రిక్ టన్నులు పంపిణీకి సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.

జిల్లాలో 162 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గాను 43 కేంద్రాలు ఇంకా ప్రారంభించాల్సి వుందన్నారు. జిల్లాలో డిశంబరు 6న ధాన్యం కొనుగోలు ప్రారంభించామని, ఇప్పటివరకు 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, రైతులకు రూ.68 కోట్లు చెల్లింపులు చేయడం జరిగిందన్నారు. సగటున ప్రతిరోజు 4000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరుగుతున్నట్టు పేర్కొన్నారు.

జిల్లాలో 128 మిల్లులు బ్యాంకు గ్యారంటీ ఇచ్చాయని, వాటి పరిధిలోనే ధాన్యం కొనుగోలు ప్రారంభమయ్యిందన్నారు. సంక్రాంతి నాటికి జిల్లాలో రైతుల నుండి 2.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు.

## ధనుర్మాసంలో మేలుకొలుపు



దేవరాపల్లి : ధనుర్మాసంలో మేల్కొల్పు ద్వారా ప్రతి ఒక్కరికి మేలు కలుగుతుందని సమరసత సేవ ఫౌండేషన్ అనకాపల్లి డివిజన్ ప్రచారకులు ఎ.గంగాధర్ అన్నారు. మండలంలోని పెదనందిపల్లి రామాలయంలో మండల కన్వీనర్ ఆదిరెడ్డి చినకన్నబాబు అధ్యక్షతన మండల స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాసం అనగా అదివారం తెల్లవారిజాము నుంచి ప్రతి గ్రామంలో మేల్కొలుపు యాత్రలో తిరగాలన్నారు.

దీని వలన గ్రామాలాభివృద్ధితో పాటు ప్రజలకు శ్రేయస్సు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో-కన్వీనర్లు కె.ముత్యాల నాయుడు, బి.దేముడు, మండల ధర్మ ప్రచారకులు జి.రాము తదితరలు పాల్గొన్నారు.

## న్యాయశాఖ ఉద్యోగుల రక్తదానం : అభినందించిన జిల్లా జడ్జి ఏ.గిరిధర్



విజయనగరం : జిల్లా న్యాయస్థానాల సముదాయంలో ఉన్న పలు కోర్టుల్లో పనిచేస్తున్న న్యాయశాఖ ఉద్యోగులు శనివారం రక్తదానం చేశారు. కోర్టు ఆవరణలో జిల్లా కేంద్ర ఆసుపత్రి రక్తనిధికి చెందిన సంచార రక్త సేకరణ వాహనంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.గిరిధర్ శిబిరాన్ని సందర్శించి రక్తదానం చేస్తున్న ఉద్యోగులను అభినందించారు. రక్త సేకరణ వాహనాన్ని పరిశీలించి అందులో ఉన్న సదుపాయాలపై తెలుసుకున్నారు. రక్తదానంపై అపోహలు పోగొట్టాలని, ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒక్కసారైనా రక్తదానం చేయాలని జిల్లా జడ్జి పేర్కొన్నారు. న్యాయశాఖ ఉద్యోగులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. ఈ శిబిరంలో 40 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. న్యాయశాఖ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఏ.వి.రమణ, సబ్ జడ్జి కె.రాంబాబు, పి.డి.ఎం. అబ్దుల్ షరీఫ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఐ.సురేష్, జిల్లా కోర్టు పరిపాలన అధికారి బి.లోకనాధం, పర్యవేక్షకులు డి.బి.వి.భాస్కరరావు, వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. న్యాయశాఖ సిబ్బంది కె.శ్రీకర్ నేతృత్వంలో రక్తదానం నిర్వహించారు. సంచార రక్త సేకరణ వాహనం ఇన్‌చార్జి రక్తనిధి వైద్యాధికారి డా.ఎం.సత్య శ్రీనివాస్, డా.సాయిరాంల ఆధ్వర్యంలో రక్త సేకరణకు ఏర్పాట్లు చేశారు.

## కవి సమయం

### 'నా పల్లె'

ఒకనాటి నా పల్లె
ఎర్రబస్సు దిగి పల్లెకు పోతుంటే
పచ్చని జొన్నచేల మధ్య మంచెకావల్లు
దారి పొడుగునా ఆప్యాయంగా పలకరింపులు
మామిడి, పూలతోటలమాటున పక్షుల కిలకిలలు
తంగేడు గుమ్మడి పూలబతుకమ్మ ఆటలు
ఏ గుడిసె ముందు నిలబడినా
సేద తీర్చుకోమని చల్లని మజ్జిగ ఇచ్చిన అక్కలు
పట్నంలో ఏం చేస్తున్నావురా అంటూ
ఆప్యాయంగా చేతిని నిమిరిన అమ్మలు
నేడు అవి అన్ని కానరాకుండా పోయాయి
గుడిసెల స్థానంలో భవంతులు
గుడిసెలలో జనం సుదూర ప్రాంతాలకు వలసలు
రోగాలతో చెట్ల క్రింద మూలుగుతున్న ముదుసలులు
భవంతులతో టి.విలకు అతుక్కుపోయిన కొందరు
తండ్రి కొడుకులతో మాట్లాడలేని బిజీబిజీ
తమ్సుఅప్‌ల రసకేళీ బ్రాంది బీర్ల దుకాణాలు
ఇంటర్‌నెట్‌లో చాటింగ్‌లు
పేదల సమాధులపై పెద్దల విహార కేళి
పల్లె మారింది పల్లె సంస్కృతి మారింది

... కవితా రచన
తుంపాల శ్రీరామమూర్తి
సెల్ నెం : 9440260280

## పంచాంగం

మాసం : మార్గశిర; తిథి :చతుర్ధశి ఉ.8.44; జ్యేష్ట పూర్తి ఉ.వ.10.38ల 12.34.

ఆదివారం 17-12-2017

**మేషం :** వాదోపవాదాలకు దూరంగా ఉండటం మంచిది. నిరుద్యోగులకు ఒక ప్రకటన కొత్త ఉత్సాహం కలిగిస్తుంది. స్త్రీలకు ఆధ్యాత్మిక విషయాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆర్థిక స్థితి మెరుగుపడటంతోపాటు రుణ విముక్తులు అవుతారు. **వృషభం :** వస్త్ర, బంగారు, వెండి వ్యాపారస్తులకు లాభదాయకం. స్త్రీలకు వస్త్రములు, అలంకరణలు, విలాస వస్తువుల పట్ల ఆకర్షణ పెరుగుతుంది. వాణిజ్య ఒప్పందాలు, స్థిరచరాస్తుల లావాదేవీల్లో ఏకాగ్రత వహించండి. గత కొంతకాలంగా మీరు అనుభవిస్తున్న ఒత్తిళ్లు, చికాకులు క్రమంగా తొలగిపోతాయి. **మిథునం :** ఉద్యోగస్తుల సమర్థతకు మంచి గుర్తింపు లభిస్తుంది. రుణం ఏ కొంతైనా తీర్చాలన్న మీ సంకల్పం నెరవేరగలదు. స్త్రీలు భేషజాలకు, మొహమాటాలకు పోవటం మంచిది కాదు. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. విద్యార్థులకు ధ్యేయంపట్ల ఏకాగ్రత చాలా అవసరం. **కర్కాటకం:** అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు అనుకూలిస్తాయి. లీజు, ఏజెన్సీ, స్థిరాస్తుల కొనుగోళ్ల విషయంలో తొందరపాటుతనం కూడదు. దంపతుల మధ్య కలహాలు తలెత్తే ఆస్కారం ఉంది. ఏజెంట్లు, మార్కెటింగ్ రంగాల వారి టార్గెట్లు పూర్తి కాగలవు. సేవ, సాంఘిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. దేవాల యాలను దర్శిస్తారు. **సింహం:** కుటుంబ సమస్యలు తీరి, ఆర్థిక పరిస్థితిలో ఆశాజనకమైన మార్పులు సంభవిస్తాయి. పాత మిత్రుల కలయికతో మీలో మార్పు వస్తుంది. విద్యార్థుల ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. మీ యత్నాలకు సన్నిహితులు అన్నివిధాలా సహకరిస్తారు. తలపెట్టిన పనులు కొంత ఆలస్యంగా నైనా పూర్తి చేస్తారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అయ్యే సూచన లున్నాయి. **కన్య:** ఆస్తి వ్యవ హారాల్లో ముఖ్యుల ప్రతిపాదనల్ని వ్యతిరేకిస్తారు. గృహ నిర్మాణాలు, మరమ్మత్తులు చేపడతారు. ఉద్యోగస్తులకు తోటివారితో సమస్యలు తలెత్తుతాయి. నిరుద్యోగ యత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. ప్రైవేటు సంస్థలలోని వారికి నిరుత్సాహం కలిగి స్తుంది. **తుల:** ఆర్థిక లావాదేవీలు, కీలకమైన వ్యవహారాలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. స్త్రీలకు చుట్టుప్రక్కల వారి నుంచి ఆహ్వానాలు అందు తాయి. నిత్యా వసర వస్తు వ్యాపారులకు, స్టాకిస్టులకు కలసిరాగలదు. కుటుంబ సౌఖ్యం, ఆత్మీయులతో వినోదాలు వంటి శుభ పరిణామాలుంటాయి. **వృశ్చికం:** స్త్రీల మాటకు వ్యతిరేకత ఎదురవుతుంది. విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనలకు గురవుతారు. ఉద్యోగయత్నాలు ఆశాజనకంగా సాగుతాయి. ప్రయాణాల్లో తగు జాగ్రత్తలు తీసు కోవలసి ఉంటుంది. దూరపు బంధువుల నుంచి బహుమతులను అందుకుంటారు. చేతి వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. **ధనుస్సు:** స్త్రీల ఆలోచనలు పొదుపు దిశగా కొనసాగుతాయి. దైవదీక్షలు, సేవా కార్యక్రమాలపట్ల ఆసక్తి పెరుగు తుంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల తీరును గమనించి మెలగాల్సి ఉంటుంది. నూతన పెట్టుబడులు, టెండర్లు అనుకూలిస్తాయి. **మకరం:** విద్యార్థులు నిరంతర కృషివల్ల అభివృద్ధి పొందుతారు. భాగస్వామిక చర్చల్లో మీ ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తుంది. ఆస్తి వ్యవహారాలకు సంబంధించి సోదరులతో ఒక అవ గాహనకు వస్తారు. వృత్తుల వారికి, ఏజెంట్లు, బ్రోకర్ల శ్రమకు తగిన ఆదాయం లభిస్తుంది. గృహ నిర్మాణాలు, మరమ్మత్తులు అనుకూలిస్తాయి. **కుంభం:** రాబడికి మించిన ఖర్చులు, చెల్లింపులవల్ల స్వల్ప ఆటుపోట్లు తప్పవు. ప్రింటింగ్, బైండింగ్ పనివారలకు మందకొడిగా ఉంటుంది. ఇచ్చిపుచ్చుకునే వ్యవ హారాలలో ఏకాగ్రత అవసరం. ఉద్యోగస్తుల కార్యదీక్ష, **మీనం:** దైవదీక్షలు, సామాజిక సేవలపట్ల ఆసక్తి పెరుగుతుంది. వృత్తుల వారికి అన్ని విధాలా కలసి రాగలదు.

## పరమేశ్వరుని సృష్టి వారణాసి

సంకీర్తన



కాశీ విశ్వనాథుని మందిరం

యావత్ విశ్వంలో సాక్షాత్తూ పరమేశ్వరుని స ృష్టిగా వారణాసిని పేర్కొంటారు. ఆ లయకారకుడైన శివుడే ఈ నగరాన్ని నెలకొల్పినట్టు పురాణాలు వెల్లడిస్తున్నాయి. ఎన్నో వేల సంవత్సరాల నుంచి కాశీ క్షేత్రంలో జనజీవితం విరాజిల్లుతోంది. పగలు, రాత్రి అని తేడా లేదు నిత్యం వేలాదిమంది యాత్రికులతో సందడిగా వుంటుందీ ఈ దివ్యక్షేత్రం. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకట్కెన విశ్వనాథక్షేత్రంగా, విశాలాక్షి వెలసిన పవిత్రభూమిగా, అన్నపూర్ణ నేలగా ఈ క్షేత్రం పేరుపొందింది. కాశీ అంటే పవిత్రక్షేత్రం. ఆ క్షేత్ర ప్రాశస్త్యాన్ని వర్ణించేందుకు మాటలు చాలవు. వేల ఆలయాలు, గంగా హారతి కార్యక్రమం, నిత్య పూజలు, భజనలు, అర్చనలు, భక్తుల రాకపోకలతో ఎప్పుడూ ఆధ్యాత్మికంగా గుబాళిస్తువుంటుంది. అందుకనే కాశీయాత్ర గురించి మన పూర్వీకులు కథలు కథలుగా చెబుతుంటారు. కాశీమజిలీ కథలు కూడా ఈ యాత్రావిశేషాలను వెల్లడిస్తూ రాసినవే. 'కాశ్యాన్తు మరణాన్ ముక్తి' కాశీలో కన్నుమూస్తే మోక్షం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

కాశీ విశ్వనాథుడు

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో విశిష్టమైనదిగా కాశీ విశ్వనాథుడిని పేర్కొంటారు. పవిత్ర గంగానదీ తీరాన వున్న ఈ మందిరంలో స్వామిని దర్శనం చేసుకుంటే ఎంతో పుణ్యం లభిస్తుందని పెద్దలు చెబుతారు. ఎన్నో వేల సంవత్సరాల నుంచి ఆలయం పలు దండయాత్రల్లో శిథిలమయింది. 18వ శతాబ్దంలో మహారాణి అహల్యాభాయి హొల్కార్ ఆలయాన్ని పునరుద్ధరించారు. రుగ్వేదం, రామాయణం, మహాభారతం, స్కందపురాణంలోని కాశీఖండంలో ఈ ఆలయం గురించిన వివరాలున్నాయి. గంగా నదిలో స్నానం చేసి స్వామివారిని దర్శించుకుంటే మంచిది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో కాశీ విశ్వనాథుని మందిర నమూనాలో దేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయాన్ని కూడా వీక్షించాలి.

కాశీ విశాలాక్షి

ఆ జగన్మాత కాశీలో విశాలాక్షిగా వెలిసారు. సతీదేవి చెవిపోగు పడిన ప్రదేశంలోనే ఏర్పడిన అమ్మవారి క్షేత్రమిది. జ్యోతిర్లింగంతో పాటు శక్తిపీఠం కావడంతో అందరికి ఈ క్షేత్రం ఆరాధ్యనిలయం. ఆ ఆదిదంపతులు స్వయంగా వెలసిన అరుదైన క్షేత్రాల్లో ఇది ఒకటి.

సకల ప్రాణకోటికి చోదకశక్తి ఆహారం. ఆహారాన్ని ఆ లోకమాతేఅందిస్తుంది కనుకే అన్నపూర్ణ మాతగా పిలుస్తారు. ఆమె కరుణా, కటాక్షాలు లేకపోతే విశ్వంలో ఆహారానికి కొరత ఏర్పడుతుంది. మానవాళి ఆకలి బాధలు తీర్చేందుకే ఆదిశక్తే అన్నపూర్ణ మాతగా కాశీక్షేత్రంలో వెలిశారు. రామ భక్త హనుమాన్ ఆలయం సంకట్‌మోచన్ మందిరాన్ని కూడా వీక్షించాలి.అద్వైత సిద్ధాంతకర్త ఆదిశంకరులకు ఈ నగరంతో మంచి అనుబంధముంది. ఆయన ఇక్కడే బ్రహ్మసూత్రాలు, భజగోవిందం తదితర గ్రంథాలు రచించారుకాశీలో కన్నుమూస్తే శివసాయుజ్యం పొందుతారని ఆర్యోక్తి. దీంతో వయోధికులు అనేకమంది కాశీలోనే తమ అంత్యజీవితాన్ని గడపాలని వస్తుంటారు. గంగాతీరంలో 80కు పైగా ఘాట్లు వున్నాయి. ఈ ఘాట్‌లోనే గంగాహారతి కార్యక్రమం నిర్వహిస్తారు. మణి కర్ణికఘాట్‌ను మహావిష్ణువే నిర్మించినట్టు పురాణాలు తెలుపు తు న్నాయి. ఈ ఘాట్‌ను నిర్మిస్తుండగా విష్ణువు కుండలం ఇందులో పడిపోయింది. అందుకు అంత పవిత్రమైన ప్రదేశంగా భాసిల్లుతోంది. ఇక్కడ చనిపోయిన వారి చెవిలో మహేశ్వరుడు తారక మంత్రాన్ని చెబుతుంటాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. హరిశ్చంద్ర ఘాట్‌లో హరిశ్చంద్రుడే కాటికాపరిగా బాధ్యతలు నిర్వహించడంతో ఆయన పేరు మీద ఘాట్‌కు పేరు వచ్చింది.



రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## నేడు పెన్షనర్స్ వైభవోత్సవం

నర్సీపట్నం : నర్సీపట్నం స్టేట్‌బ్యాంక్ ఆవరణలో నేడు పెన్షనర్స్‌డే వైభవోత్సవం నిర్వహిస్తున్నామని నర్సీపట్నం పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు వి.గజ్జలమ్మ అన్నారు. శనివారం మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంతో పాటు అనేక వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానిస్తామన్నారు. ముఖ్య అతిధులుగా నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, స్టేట్‌బ్యాంక్ ఛీఫ్ మేనేజర్ సిహెచ్.శ్రీనివాసరావు, ఏటిఒ బి.నరసింహులు, ఎస్‌టిఒ సిహెచ్‌టి.రామారావు, విశాఖపట్నం పెన్షనర్స్ సంఘం ఉపాధ్యక్షులు డా.ఎం.అప్పలనాయుడు పాల్గొంటారన్నారు. కావున పింఛనుదార్ల సంఘ సభ్యులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం సెక్రటరీ బివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

## కమనీయం రమణీయం సింహగిరీశుని సహస్ర దీపాలంకరణ



సింహాచలం : సింహగిరీసుని సన్నిధిలో ఆస్థాన మండపంలో సహస్రదీపాలంకరణ ఆర్జిత సేవ ఘనంగా జరిగింది స హస్ర దీపాలంకరణ ఉత్సవం, ఉంజల్ సేవ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వరాహలక్ష్మీనృసింహస్వామి ఉత్సవ మూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన వూయలపై ఉంచారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య శ్రీవారికి వూంజల్ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు శ్రీవారి ఉత్సవమూర్తుల చుట్టూ సహస్ర దీపాలు వెలిగించారు. అర్చకస్వాములు వేడుక నిర్వహించారు. అధిక సంఖ్యలో ముత్తైదువులు పాల్గొన్నారని సహాయ కార్యనిర్వాహణాధికారి ఎంవికె ఆచార్యులు తెలిపారు . ప్రతి శనివారం సాయంత్రం సహస్రదీపాలంకరణ ఆర్జిత సేవ జరుగుతుందని కార్యనిర్వాహణాధికారి కోడూరు రామచంద్ర మోహన్ తెలిపారు. ఈ సేవలో పాల్గొనే భక్తులు 250 రూపాయల టిక్కెట్లు తీసుకోవాలని ఆయన చెప్పారు. ప్రతి శనివారం సాయంత్రం ఐదుగంటల తరువాత దేవాలయ ఆస్థాన మండపంలో దీపాలంకరణ సేవ జరుగుతుందని ఆయన తెలిపారు. అలాగే ప్రతినెల స్వాతినక్షత్రం రోజున నృసింహ యజ్ఞం ఉంటుందని ఆయన తెలిపారు . ఈ యజ్ఞం చేయించుకునే భక్తులు 2500 రూపాయలు టిక్కెట్టు తీసుకోవాలని ఆయన తెలిపారు. స్వాతినక్షత్రం సింహాద్రినాధుని అవతార నక్షత్రమని ఆ రోజు ఉదయం 7.30 గంటల నుండి 9.30 గంటల వరకు యజ్ఞం నిర్వహిస్తామని ప్రధానార్చకు గొడవర్తి గోపాలకృష్ణ, శ్రీని వాసాచార్యులు తెలిపారు .

యజ్ఞంలో ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందివ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులంతా సద్వినియోగం చేసుకుని సింహాచలేశుని కరుణకు పాత్రులు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఈనాం భూముల క్రయవిక్రయాలు ఆపాలని డిమాండ్

- అక్రమ రిజస్ట్రేషన్లు చేసిన నర్సీపట్నం రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలి
- జిల్లా జాయింట్ కలెక్టర్‌పైనే ఆశలన్నీ అంటున్న బాధితుడు

నర్సీపట్నం : ఈనాం భూములను కొనుగోలు చేసిన వారిని రిజిస్ట్రేషన్ చేసిన నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ పైనా చర్యలు తీసుకోవాలని బాధితుడు మంగళగిరి లోవరాజు డిమాండ్ చేస్తున్నాడు. గొలుగొండ మండలం కసిమి పంచాయతీ జమ్మవరం రెవెన్యూ గ్రామంలోని తనకున్న భూమిని ఘట్టమనేని చెంచు రామయ్య(జింకా రామయ్య) తప్పుడు దృవపత్రాలు, పాసు పుస్తకాలు సంపాదించి తన భూమిని రిజిస్ట్రేషన్ చేయించే సుకున్నారని ఆరోపించారు. దీనిపై ఆర్డీవో కె.సూర్యారావుకి వినతపత్రం ఇచ్చాడు. జిల్లా జాయింట్ కలెక్టర్ సృజన స్పందిస్తేనే తనకున్యాయం జరుగుతుందని నమ్ముతున్నానన్నారు. రద్దు చేసిన పాసు పుస్తకాలని తెలిసీ రిజిస్ట్రార్ మరింత దారుణంగా రిజిస్ట్రేషన్ చేశాడన్నారు. దళిత సంఘాల నాయకులు సహాయం అందించారు. ఆయనతో పాటు దళాయి రాజు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బాధితుడు లోవరాజు

## మాజీ సర్పంచ్ కరణం శ్రీను ఆకస్మిక మరణం



అనకాపల్లి : మండలంలో శంకరం గ్రామం మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు కరణం శ్రీనివాసరావు శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. శ్రీనివాసరావు ఉదయం బాత్‌రూంలో కాలుజారి పడిపోవడంతో గుండెపోటుకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమద్యంలోనే శ్రీనివాసరావు మృతి చెందారు. దీంతో శంకరంలో గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి. శ్రీనివాసరావు భార్య లక్ష్మీశ్యామల ప్రస్తుతం శంకరం గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. శ్రీనివాసరావుకు ఇద్దరు పిల్లలున్నారు. అందరితో సఖ్యతగా ఉంటూ అందరిలో ఎప్పుడూ సరదాగా గడిపే శ్రీనివాసరావు మృతి చెందారు. అనే వార్త తెలియడంతో మండలంలోని పలువురు దిగ్భ్రాంతికి గురయ్యారు. శ్రీనివాసరావు మృత దేహాన్ని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సందర్శించి నివాళులు అర్పించారు. అలాగే ఎమ్మెల్యే పీలా గోవందసత్యనారాయణ తెలుగుదేశం పార్టీ విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు, మళ్ల సురేంద్ర, మండలంలో సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో సత్తాచాటిన ప్రశాంతి పాలిటెక్నిక్



అచ్యుతాపురం: ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ కబాడీ పోటీలో స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. విశాఖపట్నం బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ కబాడీ పోటీలో ద్వితీయ స్థానం సాదించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలో మొత్తం 26 కళాశాలల నుండి 26 టీమ్‌లు పాల్గొన్నాయన్నారు. జిల్లా స్థాయిలో కబాడీ పోటీలలో ద్వితీయ స్థానం సాదించడం పట్ల విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, చైర్మెన్ దర్మిరెడ్డి ప్రసాద్ అభినందించారు.

## మరో 28 వేల ఎకరాలకు తోటపల్లి జలాలు

- మార్చిలోగా అందించేందుకు ఏర్పాట్లు

**ఒకేసారి భూసేకరణ, పిల్ల కాల్వల పనులు చేపట్టేందుకు కార్యాచరణ : జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్**



విజయనగరం : జిల్లా రైతాంగానికి శుభవార్త. జిల్లా రైతుల చిరకాల వాంఛ అయిన తోటపల్లి ప్రాజెక్టు అయినప్పటికీ పిల్ల కాల్వలు లేక పూర్తిస్థాయి ఆయకట్టుకు తోటపల్లి జలాలను అందించలేని పరిస్థితి వుంది. జిల్లాలో తోటపల్లి ప్రాజెక్టు ద్వారా 64వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించాల్సి వుండగా ఇప్పటివరకు 36 వేల ఎకరాలకే నీటిని అందించగలుగుతున్నారు. అది కూడా కాల్వల పరిధిలో వున్న చెరువులను అనుసంధానం చేసి చెరువుల కింద ఉన్న ఆయకట్టుకు నీటిని అందించే ఏర్పాట్లు ఈ ఏడాది చేశారు. అయితే వచ్చే మార్చి నెలఖరుకల్లా పిల్ల కాల్వల నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ కృత నిశ్చయంతో ఉన్నారు. తద్వారా 28వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగునీటిని అందించి ఆయా ప్రాంత రైతాంగానికి తోటపల్లి ప్రయోజనాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం ఒక వ్యూహాన్ని కూడా సిద్ధం చేశారు. పిల్లకాల్వల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు మరోవైపు అదే సమయంలో భూసేకరణ కూడా సమాంతరంగా చేసేందుకు కలెక్టర్ ప్రణాళికలు రూపొందించారు. దీనిలో భాగంగా జాయింట్ కలెక్టర్ శ్రీకేష్ లత్కర్, భూసేకరణ ఉప కలెక్టర్‌లు, జలవనరుల శాఖ అధికారులతో శనివారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశమయ్యారు. పిల్ల కాల్వల నిర్మాణంకోసం 462 ఎకరాలు సేకరించాల్సి వుందని ఇందులో బొబ్బిలి ఛానల్‌కు 288 ఎకరాలు అవసరం వుంటుందన్నారు. రైతుల నుండి సేకరించాల్సిన భూమికి సంబంధించి వారి నుండి ఎంత విసస్తీర్ణంలో భూసేకరణ చేస్తున్నదీ వారికి ఎంత పరిహారం అందనున్నదీ నోటిఫికేషన్‌కు ముందే అవగాహన కలిగించాలని కలెక్టర్ సూచించారు. తద్వారా వారి నుండి అనుమతి పొందే అవకాశం వుంటుందని చెప్పారు. రానున్న రోజుల్లో జలవనరుల శాఖ అధికారులు పిల్ల కాల్వల పనులు ముమ్మరంగా చేపట్టి మార్చిలోగా పూర్తిచేయాల్సి వుంటుందన్నారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీకేష్ లత్కర్, జలవనరుల శాఖ అధికారులు, తోటపల్లి ప్రాజెక్టు అధికారులు, విజయనగరం ఆర్‌డిఓ కె.వి.మురళి, భూససేకరణ ఉప కలెక్టర్‌లు ఆర్.శ్రీలత, అనిత, బాల త్రిపుర సుందరి తదితరులు పాల్గొన్నారు.

## 18న పార్వతీపురం ఐటిడిఏలో ప్రజావినతులు స్వీకరించనున్న కలెక్టర్

విజయనగరం : ప్రతి నెల మూడో సోమవారం ప్రజావినతుల కార్యక్రమాన్ని పార్వతీపురంలో నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ ఈ నెలలో 18వ తేదీ మూడో సోమవారం ప్రజావినతుల కార్యక్రమాన్ని పార్వతీపురంలో నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఐటిడిఏ లోని గిరిమిత్ర సమావేశ మందిరంలో నిర్వహించే యీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తోపాటు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి జి.లక్ష్మీశ, జిల్లా అధికారులంతా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. దీనిలో ఉదయం 9 గంటల నుండి ప్రజల నుండి ఫోన్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తారు. 10 గంటలకు మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించనున్నారు. 10.30 గంటల నుండి ప్రజావినతులు స్వీకరించనున్నారు. ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపే వారు 08963-220044 ఫోన్ నెంబరుకు తమ సమస్యలు నివేదించవచ్చు.

ప్రముఖుల పర్యటనల సమాచారం తెలియజేయాలి : జిల్లా కలెక్టర్ ఆదేశాలు

జిల్లాలో ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చే మంత్రులు, ఇతర ప్రముఖుల పర్యటనల సమాచారాన్ని, వివిధ శాఖల ఉన్నతాధికారుల పర్యటన వివరాలను సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు ముందుగానే జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ ఆదేశించారు. ఆయా పర్యటనల సందర్భంగా ప్రారంభించే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారం కూడా ముందుగానే తెలియజేయాన్నారు. జిల్లాకు చెందిన కేంద్ర మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రులకు కూడా ఈ సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. అదే సమయంలో జిల్లా ప్రజానీకానికి తెలిసేలా ఆయా ప్రముఖుల పర్యటనలకు సంబంధించిన సమాచారాన్ని మీడియాకు జిల్లా పౌరసంబంధాల అధికారి ద్వారా తెలియజేయాలని, భవిష్యత్తులో ప్రముఖుల పర్యటనల సందర్భంగా సమాచారం అందించని వారిపై చర్యలు చేపడతామన్నారు.

మరుగుదొడ్లకు రికార్డు స్థాయిలో చెల్లింపులు

జిల్లాలో స్వచ్ఛ ఉద్యమంలో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం ఉధృతంగా జరుగుతున్న నేపథ్యంలో జిల్లా మరో రికార్డు సాధించింది. మరుగుదొడ్ల నిర్మాణం కోసం చెల్లింపులు వేగవంతం చేసేందుకు పలు శాఖల మండల స్థాయి అధికారులకు బిల్లులు చెల్లించే అధికారం ఇవ్వడంతో త్వరితగతన చెల్లింపులు జరుగుతున్నాయి.

ఇటీవల ఒక్క రోజులోనే రూ.3 కోట్ల బిల్లులు చెల్లింపులు చేయగా, దీనిని అధిగమిస్తూ జిల్లా వ్యాప్తంగా రూ.3.26 కోట్ల బిల్లులను మరుగుదొడ్ల నిర్మాణం కోసం మంజూరు చేశారు. ఇటీవలి కాలంలో ప్రతిరోజూ కనీసం రూ.2 కోట్లకు పైనే చెల్లింపులు జరుగుతున్నాయని, జిల్లా వ్యాప్తంగా మరుగుదొడ్ల నిర్మాణం ముమ్మరంగా జరగడానికి ఇదే నిదర్శనమని జిల్లాపరిషత్ సి.ఇ.ఓ. టి.వెంకటేశ్వరరావు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత పెద్దఎత్తున చెల్లింపులు చేసి ఫిబ్రవరి 15 నాటికి వంద శాతం ఓ.డి.ఎఫ్. లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు.

## ఘనంగా గవరపాలెంలో క్రిస్మస్ వేడుకలు

అనకాపల్లిమ : స్థానిక గవరపాలెం కొణతాల జగ్గప్పలస్వామి వీధిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ క్రైస్తవ పరిషత్ ఆంధ్రప్రదేశ్ ప్రదాన కార్యదర్శి కేపీడీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఈ భూమిమీద జన్మించడం అందరికీ సంతోషకరమైన శుభవార్త మానమని, మానవాళి విమోచన కొరకు ఆయన ఈ భూమిమీద కన్యక గర్భమందు జన్మించి ఈ భూమిమీద ఆయన అందరి కొరకును తన ప్రాణము పెట్టాడని, ఇది అందరికీ సంతోషకరమని తెలియజేశారు. అనంతరం యిటంశెట్టి కొండలరావు కేక్ కట్‌చేసి అందరికీ పంపిణీ చేశాడు. ఈ కార్యక్రమంలో కొణతాల మహేష్, కె. పరదేశినాయుడు, దాడి చిన్న, పెద్దాడ నాగమణి, కోరిబిల్లి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## టెక్నికల్ రైటింగ్ వర్క్‌షాపు ముగింపు



విశాఖపట్నం : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం లో గత ఆరు రోజులుగా జరుగుతున్న టెక్నికల్ రైటింగ్ అకాడమిక్ పై జరుగుచున్న వర్క్ షాపు శనివారం ముగిసంది.గీతం స్కూల్ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ ఆద్వర్యలో 11వ తేదిన ఛాన్సలర్ కె.రామకృష్ణారావు, వైస్ ఛాన్సలర్ ఎమ్.ఎస్.ప్రసాద్ రావు చేతులమీదగా ప్రారంభమైయినది.ఈ వర్క్ షాపు లో హైదరాబాద్ కు చెందిన సాఫ్ట్‌వేర్ మేనేజర్ నీరజ్ నెల్లిమర్ల మనియు జితేంధ్ర శివమణి పాల్గొని టెక్నికల్ రైటింగ్ పై పలు అంశాలు చర్చించి,విద్యార్థులుకు సాంకేతికంగా రాయిడంపై నైపుణ్యాలును తెలియజేశారు. విద్యార్థులు సందేహలను తెలుసుకోని నివృత్తి చేశారు ఈ రోజుల్లో ఇటువంటి వర్క్ షాపు విద్యార్థులకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆర్థికంగా, నైతికంగా విద్యాపరంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ గాంధియన్ స్టడీస్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రోషిత ఇతర ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దైవంపై నమ్మకం మానసిక ప్రశాంతతకు మార్గం

వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు



సదస్సునుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ నాగేశ్వర రావు

విశాఖపట్నం : దైవంపై నమ్మకం కలిగి ఉంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. వనివారం ఉదయం ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం సమావేశ మందిరంలో ఏయూసంగీత, తెలుగు, ఫిలాసఫీ, సంస్కృత, విభాగాలు రినైసెన్స్ యూనివర్సల్(ఆర్‌యు) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఒక రోజు జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఫిలాసఫీ, సాహిత్యం, యోగా, ఎకనామిక్స్, సైన్స్, మ్యూజిక్ రంగాలకు చేసినకృషినిపై సదస్సును ఏర్పాటుచేశారు. మీలో అంతర్గత శక్తిని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.దైవంపై నమ్మకం ఉన్నా లేకపోయినా ఇతరుల నమ్మకాలను గౌరవించడం ఎంతో అవసరమన్నారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామ మోహన రావు మాట్లాడుతూ వర్తమాన సమాజానికి ఎంతోఉపయుక్తమైన అంశంపై సదస్సు నిర్వహణ జరగడం మంచి పరిణామ మన్నారు.ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందడానికి అవసరమైన మార్గాలను ప్రకృతి మనకు కల్పిస్తుందన్నారు. దీనిని అందుకోవడానికి తగిన మార్గం లభించడం ఎంతో అవసరమన్నారు. రినైసెన్స్ యూనివర్సల్ కార్యదర్శి నారాయణ పాండా మాట్లాడుతూ దైవమే అత్యున్నత సత్యమన్నారు. రినైసెన్స్ యూనివర్సల్ ఆవిర్భావం నుంచి నేటి వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమానికి సంగీత విభాగాధిపతి ఆచార్య సరస్వతి విద్యార్థి అద్యక్షత వహించారు.

సాయంత్రం నిర్వహించిన ముగింపు సమావేశానికి వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు హాజరయ్యారు. ఆనంద్ మార్గ్ ప్రచారక్ సంఘం జనరల్ సెక్రటరీ ఆచార్య భవేశానంద అవధూతలు ప్రసంగించారు.

సదస్సులో భాగంగా శాస్త్రవేత్త ఆచార్య ఉత్తమ్ పతి, త్రిపుర కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఆచార్య అదిత్య మొహంతి, ఏయూ సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, సైకాలజీ విభాగ ఆచార్యురాలు కె.ఆర్ రజని తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఆచార్యులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## బకాయిలు తిరిగి చెల్లించాలి

కొయ్యూరు: గిరిజన ఉప ప్రణాళికలో తీసుకున్న ఉన్నతి రుణాలకు ఎటువంటి సబ్సిడి లేదని, ఆ బకాయిలను వెంటనే తిరిగి చెల్లించాలని జిల్లా వెలుగు ప్రాజెక్టు మేనేజర్ దేగలయ్య తెలిపారు. రాజేంద్రపాలెం అల్లూరి స్మారక కళా మందిరం వేదిక వద్ద మహిళలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీసుకున్న రుణాన్ని అనుసరించి నెలవారీ వాయిదాలు నిర్ణయిస్తారన్నారు. రుణాలు తీసుకున్న వారంతా విధిగా వాటిని చెల్లించాలని చెప్పారు. మహిళలు స్వయం ఉపాధి సాధించింది.రూ.30వేల నుంచి లక్ష వరకు రుణాలు అందజేసినట్టు తెలిపారు. 2017-2018లో రూ.కోటి ఏడు లక్షలు, 2016-17లో కోటి 72లక్షలు రుణాలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఇమ్మానుయేలు, ఈవోపిఆర్‌డి వరలక్ష్మి, దుచ్చరి చిట్టిబాబు, ఈశ్వరరావు, ప్రసాద్, ఎంపిపి సత్యనారాయణ,శ్రీరామ్మూర్తి, నూకరాజు ఉన్నారు.

## రైతు ధాన్యానికి మద్దతు ధర ప్రకటించాలి

సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు

దేవరాపల్లి : రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర ప్రకటించి ,ప్రభుత్వం కో ఆపరేటివ్ సొసైటీలు ద్వారా కొనుగోలు చేయలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి .వెంకన్న ,మండల కార్యదర్శి చెరుకు రాజు ,కేవీపీస్ జిల్లా నాయకులు కె .అప్పారావు డిమాండు చేశారు .మండలంలోని మారేపల్లి ,తిమిరాం , తారువ , కలిగొట్ల గ్రామంలో శనివారం పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంద ర్భంగా వారు మాట్లడుతూ రైతులు పండించింది ధాన్యం ,అపరాలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడం వలన ప్రవేటు వ్యాపారాలు రైతులను దోచుకుంటున్నారన్నారు .గత ఏడాది కన్నా ఈ ఏడాది జి ఎస్ టి ప్రభావము రైతులపై పడిందన్నారు .విత్తనాలు ,ఎరువులు ,పురుగుల మందులు విపరీతంగా పెరిగి నష్టాల్లో కూరుకుపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు .వేంటనే ప్రభుత్వం సొసైటీల ద్వారా కొనుగొలు కు చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు .

2018 డైరీలు, క్యాలెండర్లు
హోల్‌సేల్
భారతీయ స్టేషనరీ
& బుక్ సెంటర్
పూర్ణామార్కెట్
కార్ పార్కింగ్ ఎదురుగా
విశాఖపట్నం 530001
98499 92338, 2561749, 2781865

# ఆడబిడ్డలను అంతమొందిస్తే కఠిన చర్యలు




యానాం : పిండదశలోనే భృహణ హత్యలతో ఆడబిడ్డలను అంతమొందిస్తున్న వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పరి పాలనాధికారి దువులూరి సుబ్రమణ్యేశ్వరరావు అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన బేటీ బచావో, బేటీ పడావో చైతన్య సభకు ఆయన ముఖ్యఅతిధిగా విచ్చేసి మాట్లాడారు. మహిళలు పురుషులకు దీటుగా రాణిస్తున్నారన్నారు. యానాంలో స్త్రీ, పురుష లింగ నిష్పత్తి శాతం 1000 మంది మగవారికి 1140 ఉండేదని ఇప్పుడది 980 లోపుగా తగ్గిందన్నారు.

ఈ సభలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చోలన్ మాట్లాడుతూ పాలిటెక్నిక్‌లో యువతులే ర్యాంకులు, సేవా కార్యక్రమంలో ముందుంట న్నారన్నారు. జిల్లా స్త్రీ, శిశుసంక్షేమశాఖ అధికారి ఎ. శ్రీనివాసు మాట్లాడుతూ ఆడపిల్ల అంటే ఎప్పటికైనా అత్తింటికి వెళ్ళే ఒక బరువుగా చూసే సంస్కృతి నెలకొందని దీనిలో మార్పు రావాలన్నారు. ఆడబిడ్డను మహాలక్ష్మిలా చూసు కోవాలన్నారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి చింతారామజోగి, వి. శ్రీనివాసురావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మద్యం, ఇంధనం జిఎస్‌టిలోకి వస్తే ఆదాయం శూన్యం



యానం : మద్యం, ఇంధనం రవాణాశాఖ పన్నులను జిఎస్‌టిలోకి వస్తే పుదుచ్చేరి ఆదా యం శూన్యం అవుతుందని ఆర్థిక మంత్రుల సాధికారిక సంఘ సమావేశంలో తెలియజేసినట్లు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు తెలిపారు. ఢిల్లీలో బీహార్ ఆర్థిక మంత్రి సుశిల్‌మోది నేతృత్వంలో నిర్వహించిన సమా వేశంలో పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి. నారాయణ సామి తరుపున తాను వాణిజ్యపన్నులశాఖ కమీషనర్ జి. శ్రీనివాసు పాల్గొన్నానన్నారు. పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతానికి వచ్చే ఆదాయంలో 55 శాతం ఇంధనం, మద్యం, రవాణాశాఖ పన్నులద్వారానే వస్తుందన్నారు. వీటిని జిఎస్‌టి పరిధిలోకి తీసుకువెళితే స్వియ ఆదాయం లేకుండాపోతుందని తెలియజేశా మన్నారు. కేంద్ర ఇచ్చే పన్నులవాట పది సంవత్సరాలనుండి పెరగడంలేదని వివరించి నట్లు తెలిపారు.

# జన్మభూమి సభలు విజయవంతంగా జరపాలి

భీమునిపట్నం : భీమిలి డివిజన్ టి.డి.పి. అధ్వర్యంలో అద్యక్ష, కార్యదర్శులు గంటా. నూకరాజు, గాడు.సన్యాసినాయుడు అద్యక్షతన డివిజన్ పార్టీ సమావేశం జరిగింది జనవరి 2 వ తేదీ నుంచి జరగబోవు జన్మభూమి సభలను విజయవంతము చేయుట ప్రభుత్వ పథకాలను ప్రచారం, అరుహులైన లబ్ధిదారులకు పెన్షన్‌లు మంజూరు చేయుటకు ప్రతీ కార్యకర్త వారి వారి వార్డులలో అర్హులను గుర్తించి ప్రతీ పేదవాడికి న్యాయము చేయాలని, జన్మభూమి సభలను విజయవంతము చేయాలని డివిజన్ టి.డి.పి. అద్యక్షులు గంటా.నూకరాజు కోరారు. ఈ సమావేశానికి జిల్లా టి.డి.పి. నాయుకులు గాడు.అప్పలనాయుడు, మాజీ కౌన్సిలర్ జి. నరేంద్ర కుమార్, పి.యోగి, కె.అప్పల నాయుడు, దాసరి.వెంకటేష్, జి.పోలిరాజు ఎం.సంజీవ్ కు మార్, గిడుతూరి.శ్రీను, వూళ్ళ.దుర్గారావు నివాం రావు, మహిళా అద్యక్షురాలు పి.ఎల్లయ్యమ్మ, కుప్పిలి.దుర్గ, అప్పికొండ.రాజు, ఎస్.కె.అన్వర్, ఐ.ఎస్.ఆర్ .కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సు




విశాఖపట్నం : ఆధునిక సాంకేతిక అభివృద్ధిని విద్యార్థులకు చేరువ చేసేలా కారవెల్ ఒన్27 ఆధ్వర్యంలో రంగరాయ మెడికల్ కళాశాల (ఆర్‌ఎంసి)లో నిర్వహిస్తున్న సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సదస్సుకు గౌరవ నీయులైన ఉపకులపతి ప్రొ.వివిఎస్ఎస్.కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ప్రొ. విఎస్ఎస్.కుమార్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వలన రానున్న రోజులలో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, పాశ్చాత్య దేశాలు ఈ సాంకేతికతను ఉపయోగించుకుని ప్రగతి బాట వైపు పయని స్తున్నాయన్నారు. భారతదేశంలో దీనిపై పరిశో ధనలు చేపట్టి సమాజాభివృద్ధికి భావితరం ఇంజనీర్లు ముందుకు రావాలన్నారు. సదస్సులో భాగంగా వినయ్ రంజిత్ మెషిన్ లెర్నింగ్ గురించి వివరించి ప్రస్తుత పరిణామాలకు తగ్గట్లుగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. తదుపరి రేడియాలజిస్ట్ టి.నాగేశ్వరరావు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి వివరించి భవిష్యత్తు తరాలకు రోబోల వలన ఉద్యోగ కొరత ఏర్పడుతుందని, దీనిని ఎదుర్కొనేందుకు విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. అనంతరం లిఖితేష్ శ్రీరంగం సైబర్ సెక్యూరిటీ గురించి, సైబర్ నేరాలను అరికట్టడంలో విద్యార్థులు నైపుణ్యతను ఎలా పెంపొందించుకోవాలో వివిధ రకాల టెక్నాలజీల ద్వారా విశదీకరించారు.

ఈ సందర్భంగా కన్వర్జ్ కాన్ఫరెన్స్ నిర్వాహకులు లాభరహిత సంస్థ (నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్)ను స్థాపించనున్నట్లు ప్రకటించారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. భవిష్యత్తులో ఇటువం టి సదస్సుల ద్వారా విద్యార్థులకు ఆధునిక సాంకేతికతపై మరెన్నో విషయాలపై అవగాహన కల్పిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాన్ఫరెన్స్ ఛైర్మన్ కె.వంశీ, అధ్యా పకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీని పరిశీలించిన పరిపాలనాధికారి దవులూరి

యానాం : స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాల వెనకనున్న వ్యవసాయ శాఖ నర్సరీని పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు పరిశీలించారు. శనివారం ఉదయం వ్యవసాయ శాఖ డిడి శివశంకర్ మురగన్‌తో కలసి నర్సరీలో ఉన్న వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. వచ్చేఏడాది జనవరి 6,7,8 తేదీలలో స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా మైదానంలో ఏర్పాటు చేయనున్న ఫల,పుష్ప ప్రదర్శనలో ఏర్పాటుచేయనున్న వివిధ రకాల పుష్పజాతులు, అలాగే ఫలాలు ఏర్పాట్లుపై తీసుకోవలసిన అంశాలపై ఆరాతీసారు. ఇతర ప్రాంతాల నుండి తీసుకురావలసిన పుష్పజాతుల రకాలు, అకట్టుకొనే విధంగా ఏర్పాటుచేయాలన్నారు. దీనికి కావలసిన ఏర్పాట్లను త్వరతగతిన పూర్తిచేయాలన్నారు.

# టైటిల్‌లాక్ ఆధునీకరణ

తాళ్లరేవు : మండలంలోని నీలపల్లి, యానాం రహదారి ప్రాంతంలో సముద్రంనుండి వచ్చే వరదనీటిని అడ్డుకొనే టైటిల్ లాక్‌లకు మరమ్మతులు చేపట్టడంతోపాటు కొత్తవికూడా అమర్చనున్నట్లు తాళ్లరేవు డిసి ఛైర్మన్ సాగి బాబ్జిరాజు తెలిపారు. నీలపల్లి యానాం సరిహద్దులోని టైటిల్‌లాక్ తలుపులు శిధిలస్థితికి చేరుకున్నాయన్నారు. వాటి స్థానంలో తూర్పు డెల్టా ఆధునీకరణ నిధులు రూ. 50 లక్షలతో కొత్తవి ఏర్పాటుచేసినట్లు డిసి ఛైర్మన్, హెడ్‌వర్క్ ఎఇ ఈశ్వర్ మన్యం తెలిపారు. ఇకపై తలుపులు ఎత్తడం, దించడం సులువుగా ఉంటుందన్నారు.

# ఘనంగా ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు

రావులపాలెం : కోనసీమ తిరుపతిగా పేరుపొందిన వాడపల్లి వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం నుండి ధనుర్మా సోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువఝాము నుండి ఆలయంలో వైష్ణవ సాంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహిం చారు. తీర్థపు బిందె, మేలుకొనుపు, విశ్వక్సేన పూజ, భోగం వంటి కార్యక్రమాలు వంటివి స్వామికి నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు ఏర్పాటు చేసారు. ధనుర్మాసం అంటే విష్ణుమూర్తికి ప్రతీతి. పైగా శనివారం కావడంతో వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో నిండి గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. చుట్టు ప్రక్కల జిల్లాలనుండే కాకుండా ఇతర రాష్ట్రాలనుండి వచ్చిన భక్తులు స్వామి దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ చేసారు. భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఛైర్మన్ కరుటూరి నరసింహారావు, ఈఓ ముదునూరి సూర్యనారాయణరాజులు దగ్గరుండి భక్తులకు భోజన వసతి, పాలు వగైరాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది, ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరుల పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం ఖాయం



అచ్యుతాపురం: 2019లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం కాయమని పిసిసి అధికార ప్రతినిధి సతీస్ వర్మ అన్నారు. శనివారం రాహుల్ గాంధీ ఎఐసిసి అద్యక్షునిగా భాద్యతలు స్వీకిరించిన నేపధ్యంలో మండల కేంద్రమైన అచ్యుతాపురంలో సంబరాలు నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సంబరాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని, దేశం అభివృద్ది చెందాలంటే రాహుల్ ప్రధాని కావాలన్నారు. సోనియా గాంధీ గత 19 సంవత్సరాలుగా పార్టీ అద్యక్షురాలిగా పార్టీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. 2 సార్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా సోనియా గాంధీ ప్రధాని పదవి చేపట్టలేదన్నారు. ఆమె పార్టీ అధ్యక్ష స్థానంలో ఉండి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని పార్టీని నడిపించారన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడానికి కార్యకర్తలు సైనికుల్లా కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కూండ్రపు అప్పారావు, తనకాల అనంతరావు, మడక చిన్నా, ఒరుపుల అప్పలరాజు, యలమంచిలి, రాంబిల్లి, మునగపాక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదివాసీ రిజర్వేషన్ సంరక్షణ కమిటీ ఏర్పాటు దశల వారీగా పోరాటం ఉదృతికి ప్రణాళిక

కొయ్యూరు : బోరులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దశల వారీగా పోరాటాన్ని ఉదృతం చేయనున్నారు. ఈ మేరకు అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ రిజర్వేషన్ సంరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. మొదటి శాంతియుతంగా ర్యాలీలను నిర్వహించనున్నారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపనున్నారు. తరువాత ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో అవగాహన సమావేశాలు నిర్వహిస్తారు. ధర్నాలు నిర్వహించి బంద్‌లను పాటిస్తారు. చివరగా నిరాహారదీక్షలు చేపట్టనునానరు. గిరిజన ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు ఎస్.సన్యాసిరావును ముఖ్య సలహాదారునికి ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఓ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బి.రమేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా ఎస్.దిలీప్, జి.రాంబాబు, ఎస్.చిన్నబ్బాయి, సంయుక్త కార్యదర్శులుగా ఎన్.ఫణీంద్రడు, కె.శ్రీనుబాబు, ఎస్.సూరిబాబు, నిర్వహక కార్యదర్శులుగా డి.రామకృష్ణ, జి.చిన్నారావు, బి.ప్రసాద్, మహిళా కార్యదర్శులుగా కె.బంగామ్మ, కె.మాధురి ఎన్నికయ్యారు.

# ఆలిండియా పోలీస్ బ్యాడ్‌మెంటన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న డిఎస్‌పికి అభినందనలు




విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లా డి.టి.సి., డిఎస్‌పి., ఆర్ శ్రీనివాస్ 2014 సంవత్సరంలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఆలిండియా పోలీస్ బ్యాడ్‌మెంటన్ ఛాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్‌ను 45 సంవత్సరాలు విభాగంలో సాధించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అతనికి రెండు ఇంక్రిమెంట్లు, రూ. 2 లక్షల పురస్కారం ప్రకటించగా ఆ నగదు రాష్ట్ర డిజిపి తన అకౌంటుకు జమైనట్లు డిఎస్‌పి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి తన కార్యాలయంలో డిఎస్‌పిని అభినందించారు. అలాగే ఈ నెల తేది 20 నుండి 24 వరకు కొచ్చిన్‌లో జరిగే ఆలిండియా పోలీసు బ్యాడ్‌మెంటన్ ఛాంపియన్‌షిప్‌లో డిఎస్‌పి పాల్గొంటున్న సందర్భంగా జిల్లా ఎస్‌పి ఆయనను అభినందిస్తూ రూ. 10 వేలును కిట్ అలవెన్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఎ. వెంకటరావు, ఇన్‌స్పెక్టర్, ఎస్‌బిఐక్స్ ఎం.వి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# అవంతీ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ



భీమునిపట్నం : తగరపువలసలో గల అవంతీ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు విజయనగరంలో గల ఎం.ఆర్. కాలేజిలో జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాల ఆటల పోటిల్లో అవంతీ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్ధులు కబాడీలో జిల్లాస్థాయిలో మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా అవంతీ విద్యాసంస్థల ఛైర్మన్ మరియు అనకాపల్లి ఎం.పి.ముత్తంశెట్టి శ్రీనివాసరావు జిల్లా స్థాయిలో మొదటి స్థానం వచ్చినందుకు విద్యార్థులను అభినందించారు. రాష్టస్థాయిలో కూడా మీయొక్క ప్రతిభ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.అర్జునరావు, కళాశాల డైరెక్టర్ ఎస్.వి. రాఘవరావు, పి.డి.ఎన్.రాజారావు పాల్గొన్నారు.

# బెల్ట్సు టైలు పంపిణీ

భీమునిపట్నం : రాయిప్పాలెం మునిసిపల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు టీచర్స్ హెల్ప్ గ్రూప్ వారు పాఠశాలలోని విధ్యార్థులకు స్కూల్ బ్యాగులు, బెల్టు టైలు పంపిణీ చేశారు. ఈ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు మరియు టీచర్స్ హెల్ప్ గ్రూప్ సభ్యురాలు జి.శ్యామలా దేవి మాట్లాడుతూ టీచర్స్ హెల్ప్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు చేయూత పాటు వారికీ నైతిక విలువలు,సేవాభావాన్ని కలుగ జేయడమే ముఖ్య ఉద్దేశ్యం మని గవర్నమెంట్ పాటశాల విద్యార్థులు అన్ని రంగాలలో మేదస్సు ,తెలివి చూపి జీవితంలో స్థిర పడాలని అలాగే ప్రభు త్వ పాఠశాలలో ఉండే సదుపాయాలను అంద రూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీచ ర్స్ హెల్ప్ గ్రూప్ వారు చేసే కృషిని అభినందిం చారు. ఈ కార్యక్రమానికి రేఖవానిపాలెం పంచాయితీ సర్పంచ్, వైస్ సర్పంచ్ శ్రీవాసరావు మురళి, టీచర్స్ హెల్ప్ గ్రూప్ సబ్యులు ఏస్.ఎం.సి ఛైర్మెన్, ఉపాధ్యాయులు, గ్రూప్ వ్యవస్థాపకుడు తదితరులు పాల్గొన్నారు .

# అంగరంగ వైభవంగా సత్యదేవుని మెట్లోత్సవం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి వాసుడు శ్రీ సత్యదేవుని కొండకు చేరుకొనే మెట్ల మార్గము మార్గశిర మాసం సందర్భంగా దనుర్మాసమును పురస్కరించుకుని కొండదిగువ తొలిపాంచాల వద్ద నుండి ప్రధాన ఆలయం తూర్పు రాజగోపురం చివర మెట్టు వరకు మెట్టు, మెట్టుకు పసుపు, కుంకుమ పుష్పాలరంకరణ ఆపై కర్పూర హారతి నైవేద్యముతో ప్రత్యేక శోభను సంతరించుకొన్నాయి. భక్తులు ప్రతీ మెట్టును స్వామివారి అంశంగా భావించి పూజిం చారు. ఉదయం 8 గంటలకు శ్రీ సత్యదేవుడు, అమ్మ వార్ల ఉత్సవ మూర్తులను మెట్ల మార్గంలో పల్లకి మీద ఊరేగిస్తూ కొండదిగువకు తీసుకొని వచ్చారు. స్వామివారి ప్రత్యేక పూజలు అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణ, కోలాట నృత్యాలు మద్య గ్రామంలో స్వామివారి, అమ్మవార్లను వెండి పల్లకీపై ఊరేగించారు. అనంతరం తొలిపాంచాల పాదాల మండపం వద్ద ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్ధ ప్రసాదాలు పంపిణీ చేసారు. ఉదయం 9-30 లకు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద గల తొలి మెట్టును ముతైదువులు పసుపు, కుంకుమ, పూలుతో అలంకరించగా ఈవో జితేంద్ర కొబ్బరికాయ కొట్టి మెట్లకు హారతి ఇచ్చి మెట్లోత్సవాన్ని ప్రారంభిం చారు. ఇలా మొత్తం 450 మెట్లకు పూజలు చేస్తూ చివరగా అనివేటి మండపం మెట్ల వద్ద హారతి వెలిగించ డతంతో కార్యక్రమం ముగిసి నది. ఈ కార్యక్రమంలో ఈవో జితేంద్ర,ట్రస్ట్ బోర్డు మెంబర్ పర్వత.రాజబాబు, ఎసి ఈరంకి.జగన్నాధరావు, పిఆర్వో తులా.రాముడు, సూపరింటెండెంట్ బలువు. వాసు, పోల్నాటి. లక్ష్మీనారాయణ, మరియు వేదపండితులు, ప్రధాన అర్చకులు కొండవీటి. సత్యనారాయణ, దేవస్థానం సిబ్బంది మరియు అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చిత్రభాను

## మెగా డాటర్‌తో ప్రభాస్ పెళ్లి.. ?

### ................మీడియాలో రూమర్ వైరల్..................



మెగా అల్లుడు కాబోతున్న ప్రభాస్ ! సినీ పరిశ్రమలో హీరో హీరోయిన్లపై చాలా రూమర్లు ఎందుకు పుడుతాయో.. ఎక్కడ నుంచి పుడుతాయో ఓ పట్టాన అర్థం కావు. కానీ అలాంటి రూమర్లు చాలా గందరగోళానికి గురిచేస్తాయి. తెలుగు సినీ పరిశ్రమలో మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్ ప్రభాస్ పెళ్లి వార్త ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకొన్నది. ప్రభాస్ పెదనాన్న క ృష?ంరాజు ప్రభాస్ జాతకాల ప్రస్తావన తేవడంతో పెళ్లి వార్తలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆసక్తికరమైన, నిరాధార వార్త ప్రచారంలో ఉంది. అదేమిటంటే.. గతంలో ప్రభాస్, అనుష్కల మధ్య అఫైర్ ఉందని, వారు పెళ్లి కూడా చేసుకొంటారని వార్తలు రూమర్లు తెగ షికారు చేశాయి. ఇదిలా ఉండగా, మెగా డాటర్‌తో పెళ్లి జరుగనుందని వార్తలు వచ్చాయి. కానీ ఆ వార్తలన్ని అబద్ధాలేనని తేలిపోయాయి. బాహుబలి తర్వాతనే పెళ్లి ప్రభాస్ వద్ద పెళ్లి ప్రస్తావన తెచ్చినప్పుడు బాహుబలి తర్వాత చేసుకొంటానని చెప్పేవారట. బాహుబలి సినిమా పూర్తయి సుమారు ఏడాది కావోస్తున్నది. అయినా పెళ్లిపై అంతగా ప్రభాస్ చూపడం లేదనేది ఇండస్ట్రీలో టాక్. ప్రస్తుతం సాహొ చిత్రంలో ప్రభాస్ బిజీగా ఉన్నారు. మెగా డాటర్‌తో పెళ్లి రూమర్ తాజాగా ప్రభాస్, మెగా డాటర్‌తో పెళ్లి జరుగుబోతున్నదనే ఓ నిరాధారమైన వార్త మీడియాలో, యూట్యూబ్ చానెళ్లలో ప్రచారమవుతున్నది. అయితే ప్రభాస్ పెళ్లి గురించి పెదనాన్న క ృష?ంరాజుతో మెగా కుటుంబ సభ్యులు మాట్లాడారనేది ఆ రూమర్ సారాంశం. భీమవరం అమ్మాయితో.. అందులో ఎలాంటి నిజం లేదని అనిపిస్తున్నది. మరో వార్త కూడా ప్రచారంలోకి వచ్చింది. భీమవరం పట్టణానికి చెందిన ఓ అమ్మాయితో ప్రభాస్ పెళ్లి కుదిరే అవకాశం ఉంది. జాతకాలు చూస్తున్నారు. ఒకవేళ జాతకాలు కుదిరితే పెళ్లి జరుగుతుంది అని క ృష?ంరాజు చెప్పడాన్ని బట్టి ప్రభాస్ పెళ్లి ఎంతో దూరం లేదు అనిపిస్తున్నది. సాహొకు ముందా.. తర్వాత ప్రస్తుతం ప్రభాస్ సాహొ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. వచ్చే ఏడాది చివర్లో ఆ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నది. ప్రభాస్ పెళ్లి సాహొ తర్వాత జరుగుతుందా? లేదా అంతకుముందే జరుగుతుందా అనే ప్రశ్నలకు కొద్దిరోజులు ఆగితే సమాధానం దొరకడానికి అవకాశం ఉంది.

## మల్లికాకు చేదు అనుభవం..



సోషల్ మీడియా జోరు కొనసాగుతున్న నేపథ్యంలో సినీ తారల వ్యక్తిగత ఇష్టాలకు కాలం చెల్లినట్టే కనిపిస్తున్నది. ఎందుకంటే ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అభిమానులు ఫాలో అవుతున్న క్రమంలో సినీ స్టార్లు చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి వస్తున్నది. ఏ మాత్రం ఎక్స్‌ట్రా అనిపించినా మొహమాటం లేకుండా అడ్డదిడ్డమైన కామెంట్లతో పరువుతీస్తున్నారు. ఇలాంటివేమీ పట్టించుకోని సెక్స్‌బాంబ్ మల్లికా షెరావత్‌కు సోషల్ మీడియాలో చేదు అనుభవం ఎదురైంది. అదేంటో మీరే చూడండి.. మల్లికా షెరావత్ పొద్దునే లేచి గోడ పక్కకు తీరికగా కూర్చొని ఓ ఫొటో దిగింది. ఆ ఫొటోను వెంటనే సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఇక చెప్పాల్సిందేముంది. నెటిజెన్లు నోటికి వచ్చినట్టు వాగారు. అడ్డదిడ్డమైన కామెంట్లతో మల్లికాను రఫ్ ఆడించారు. ఇంతకీ మల్లికాను ఎలాంటి సూటిపోటి మాటలతో కుళ్లపొడిచారంటే.. టాయిలెట్‌పై రిలాక్స్ అవుతున్నావా? నీవు కూర్చున్న పొజిషన్ చూస్తుంటే టాయిలెట్ మీద రిలాక్స్ అవుతున్నట్టు కనిపిస్తున్నది. నిన్ను చేస్తే ఆస్ట్రిచ్ పక్షిలా కనిపిస్తున్నావు అని కామెంట్లతో మల్లికాను ఇరగదీశారు. మరో వ్యక్తి అయితే ఆంటీ అంటూ సంబోధిస్తూ సెటైర్లు వేశాడు.. మల్లికా చెత్త ఫోటోషూట్ మల్లికా నీవు అంత పొద్దున్నే దేనికోసం చూస్తున్నావు. నీ ఫొటో చేస్తూ అదో చెత్త ఫొటోషూట్ అనిపిస్తున్నది అని మల్లికాకు కామెంట్లు విసిరారు. ఇలా ఫొటో కింద చాలా రకాల కామెంట్లతో విసిగించారు. చివరికి చేసేది ఏమీ లేక ఆ ఫొటోను మల్లికా తొలగించాల్సి వచ్చింది. మల్లికాకు మరో చేదు అనుభవం ఇదిలా ఉంటే.. మల్లికాకు మరో చేదు ఘటన ఎదురైంది. ప్యారిస్‌లో మల్లికా షెరావత్ తన స్నేహితుడు ఆక్సెన్‌ఫ్యాన్స్‌తో ఓ అపార్ట్‌మెంట్‌లో కలిసి ఉంటున్నది. అయితే ఆ అపార్ట్‌మెంట్ అద్దె చెల్లించలేదని ఆమెను ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టారటనేది ఫ్రెంచ్ పత్రికల కథనం. దాదాపు 60 లక్షల రూపాయల అద్దె బాకీ ఉన్నట్టు కథనాల్లో పేర్కొన్నారు. మల్లికా ఖండన అయితే ఇంటి నుంచి వెళ్లగొట్టారని వచ్చిన వార్తలను మల్లికా షెరావత్ ఖండించింది. నేను ఎవరికీ అద్దె బాకీ పడలేదు. ఈ అంశంలో వస్తున్న వార్తలన్నీ అవాస్తవాలే. ఇలాంటి విషయాలను తానేమీ పట్టించుకొను అని మల్లికా వెల్లడించింది. మల్లికకు ఆర్థిక ఇబ్బందులు కాగా, మల్లికాకు సంబంధించిన మరో వార్తను బీబీసీ ప్రసారం చేసింది. మల్లికా ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయింది అని కథనంలో వెల్లడించింది. ప్రస్తుతం యాక్షన్ అడ్వెంచర్ చిత్రం టైమ్ రైడర్స్ నటిస్తున్నది.

## యువ హీరోతో రకుల్ ప్రీత్..



టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ ఎవరంటే రకుల్ ప్రీత్ సింగ్ అని ఠక్కున సమాధానం వస్తుంది. ఎందుకంటే సీనియర్ హీరోలతోపాటు, యువ హీరోలతో కూడా జత కడుతూ వరుస విజయాలను సొంతం చేసుకొంటున్నది. కేవలం టాలీవుడ్‌కే పరిమితం కాకుండా దక్షిణాది, బాలీవుడ్ చిత్రాల్లో నటిస్తూ కెరీర్ పరంగా దూసుకుపోతున్నది. ఎప్పటికప్పుడు కథాబలం ఉన్న చిత్రాలను ఎంపిక చేసుకొంటున్న రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా ఓ మల్టీస్టారర్ చిత్రానికి పచ్చ జెండా ఊపినట్టు సమాచారం. గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్‌ను అందించిన దర్శకుడు హరీష్ శంకర్ ప్రస్తుతం దాగుడుమూతలు అనే మల్టీస్టారర్ చిత్రాన్ని రూపొందించే పనిలో ఉన్నాడు. డీజే చిత్రాన్ని రూపొందించిన దిల్ రాజు ఈ సినిమాకు నిర్మాత. ఈ చిత్రంలో నితిన్, శర్వానంద్ హీరోలుగా నటిస్తున్నారు. సాయిపల్లవి గ్రీన్ సిగ్నల్ ఈ ఇద్దరు కుర్ర హీరోల సరసన నటించేందుకు ఇప్పటికే సాయి పల్లవిని ఎంపిక చేసుకోగా, మరో హీరోయిన్ రకుల్ పేరు పరిశీలనలో ఉంది. ప్రస్తుతం రకుల్‌తో డేట్లు, రెమ్యునరేషన్ తదితర విషయాలపై ఇంకా చర్చలు జరుగుతున్నాయనేది తాజా సమాచారం. రకుల్ ప్రీత్ నటిస్తుందా దాగుడు మూతలు చిత్రంలో రకుల్ నటిస్తుందా అనే విషయంపై ఇంకా క్లారిటీ లేదు. అయితే తన నిర?యాన్ని హరీష్ శంకర్‌కు చెప్పకుండా ఇంకా నాన్చుతున్నది అనేది ఫిలింనగర్ టాక్. శర్వానంద్‌తో రకుల్ నితిన్‌తో సాయిపల్లవి జతకట్టనున్నది. శర్వానంద్ సరసన రకుల్ ప్రీత్ సింగ్ నటించే అవకాశం ఉంది. ఈ చిత్రం 2018 మార్చిలో సెట్స్ పైకి తీసుకెళ్లాలనే ఆలోచనలో దిల్ రాజు ఉన్నారు. ఐయారీ చిత్రంలో కాగా రకుల్ ప్రస్తుతం ఐ యారీ అనే బాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నది. ఈ చిత్రంలో హీరోగా సిద్ధార్థ్ మల్హోత్రా, మనోజ్ బాజ్‌పేయ్ నటిస్తున్నాడు. ఈ చిత్రానికి నీరజ్ పాండే దర్శకుడు. ఈ చిత్రం జనవరి 26న రిలీజ్‌కు సిద్ధమవుతున్నది.

## కీర్తి రెడ్డితో బ్రేకప్‌కు కారణం అదే..



అక్కినేని నట వారసుడిగా వచ్చిన సుమంత్ తొలి నాళ్లలో మంచి విజయాలను సొంతం చేసుకొన్నారు. రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ప్రేమకథ చిత్రం ద్వారా మంచి హీరోగా గుర్తింపు పొందారు. ఆ తర్వాత యువకుడు, సత్యం, గౌరీ లాంటి చిత్రాలు ఆయనకు మంచి పేరు సంపాదించిపెట్టాయి. కానీ వరుస ఫ్లాప్‌ల కారణంగా టాలీవుడ్ పరిశ్రమకు కొంత దూరమయ్యాడు. పెళ్లి తర్వాత నటి కీర్తిరెడ్డికి విడాకులు ఇవ్వడం జరిగింది. ఇలాంటి పరిస్థితుల మధ్య ఆయన కెరీర్ గాడిలో పడలేకపోయింది. తాజాగా ఆయన నటించిన మళ్లీరావా అనే చిత్రం మంచి సక్సెస్ సాధించింది. ఈ నేపథ్యంలో ఓ యూట్యూబ్ ఛానెల్‌తో మాట్లాడుతూ.. ఆయన వ్యక్తిగత, కుటుంబ, సినీ విశేషాలను వెల్లడించారు. ఆయన ఏమన్నారంటే.. చిన్నతనం నుంచి అమ్మానాన్నకు దూరంగా పెరిగాను. మా అమ్మ చనిపోయిన తర్వాత తాత అక్కినేని నాగేశ్వర్‌రావు వద్దనే పెరిగి పెద్దయ్యాను. ఆయనతో అనుబంధం చాలా ఎక్కువ. ఆయన ప్రభావం నాపై ఎక్కువగా ఉంటుంది. నాగార్జునతో విభేదాలు లేవు మళ్లీరావే చిత్ర ప్రమోషన్‌లో మేనమామ అక్కినేని నాగార్జున పాల్గొనకపోవడం విభేదాలే కారణమన్న విషయాన్ని సుమంత్ తప్పుపట్టారు. మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు. ఆయన వ్యక్తిగత పనుల్లో బిజీగా ఉండటం కారణంగా ఆయన ప్రమోషన్‌లో పాల్గొనలేదు. నాగచైతన్య వచ్చి నా సినిమా ప్రమోషన్‌లో పాల్గొన్నాడు. హీరోగా నిలబెట్టింది మామయ్యనే నన్ను హీరోగా నిలబెట్టింది చిన్నమామయ్యనే. నేను ఫ్లాపుల్లో ఉంటే సత్యం సినిమా తీసి నాకు బ్లాక్‌బస్టర్ ఇచ్చాడు. ఆ తర్వాత మరో సినిమా ఇచ్చి నా కెరీర్‌ను నిలబెట్టాడు. ప్రస్తుతం అఖిల్‌ను హీరోగా నిలబెట్టే ప్రయత్నంలో మామయ్య బిజీగా ఉన్నారు. నా టైం అయిపోయింది ప్రస్తుతం నాగ్ మామయ్య నన్ను హీరోగా నిలబెట్టడానికి అవకాశం లేదు. నా టైం అయిపోయింది. నా కెరీర్‌ను జాగ్రత్తగా ప్లాన్ చేసుకొనే పనిలో ఉన్నాను. అవసరమైతే మామయ్య నాకు హెల్ప్ చేయడానికి ఎప్పుడూ రెడీగా ఉంటారు. అలా అంటే ఒప్పుకోను నాకు సినిమాలను ఎంపిక చేసుకోవడం రాదు అంటే ఒప్పుకొను. కొన్నిసార్లు మనం ఎంచుకొన్న సినిమాలు ఆడుతాయి. కొన్ని పరిస్థితుల వల్ల మంచి చిత్రాలను ఎంపిక చేసుకోలేకపోతాం. అంతమాత్రాన ఓ నిర?యానికి రావొద్దు. ఆ సినిమా చాలా చెత్త నేను నటించిన సినిమాల్లో రాజ్ సినిమా అతి చెత్త చిత్రం. వీఎన్ ఆదిత్యను తప్పుపట్టే సమస్యలేదు. ఆ సినిమాకు ఆదిత్య పూర్తి బాధ్యుడు చేయడం తప్పు. ఎందుకంటే ఆయన కేవలం ఆ ప్రాజెక్ట్ మధ్యలో వచ్చాడు. ఆయన ఈ చిత్రానికి పూర్తిస్థాయి దర్శకుడు అంటే నేను ఒప్పుకోను. నువ్వేకావాలి అందుకే చేయలేదు నువ్వే కావాలి చిత్రం నా వద్దకు ముందు వచ్చింది. కానీ ఆ సమయంలో యువకుడు, మరో చిత్రం చేస్తున్నాను. డేట్స్ సమస్య రావడంతో నేను ఆ సినిమాను చేయలేకపోయాను. ఆ తర్వాత స్రవంతి రవికిషోర్ సినిమాలో నటించాను. పెళ్లి నాకు వర్కవుట్ కాలేదు పెళ్లిపై నాకు పెద్దగా అభిప్రాయం ఏమీలేదు. అది కొందరికి వర్కవుట్ అవుతుంది.

## తాగినప్పుడు అలా చేస్తాను.. సప్తగిరి



అసిస్టెంట్ డైరెక్టర్‌గా సినీ జీవితాన్ని ప్రారంభించిన సప్తగిరి.. కమెడియన్‌గా.. ఆ తర్వాత హీరోగా సత్తా చాటుకొన్నాడు. సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌తో ప్రారంభమైన ఆయన హీరో ప్రయాణం బ్రహ్మాండంగా సాగింది. తాజాగా విడుదలైన సప్తగిరి ఎల్‌ఎల్‌బీ చిత్రం విజయం సాధించిన సందర్భేగా ఆయన ఓ టెలివిజన్ చానెల్‌తో మాట్లాడారు. సప్తగిరి చెప్పిన విషయాలు ఆయన మాటల్లోనే.. చిన్నప్పటి నుంచి డైరెక్టర్ కావాలని కలలు కనేవాడిని. సినిమాలు చూసి బాగా విశ్లేషించేవాడిని. చదువు పెద్దగా అబ్బలేదు. క్రికెట్ ఆడాలని ఉండేది. నా కుటుంబ పరిస్థితుల కారణంగా అది సాధ్యం కాదు అని తెలుసుకొన్నాను. అందుకే సినిమా రంగంలో రాణిస్తాను అని డిసైడ్ చేసుకొని పరిశ్రమలో అడుగుపెట్టాను. ఆ రెండు సినిమాలు నేను సినిమాల్లోకి రావడానికి ప్రధాన కారణం రెండు సినిమాలు. క ృష?వంశీ రూపొందించిన సింధూరం, శంకర్ దర్శకత్వం వహించిన భారతీయుడు. ఈ సినిమాలు నా బాగా టెంప్ట్ చేశాయి. యవ్వనంలో ప్రేమ కథా చిత్రాలు ఆకట్టుకొంటాయి. కానీ నన్ను మాత్రం ఈ రెండు చిత్రాలు నాలో స్ఫూర్తిని పెంచాయి. నా పేరు సప్తగిరి నా పేరు వెంకట ప్రభు ప్రసాద్. ఒకరోజు తిరుమల మాఢవీధుల్లో అలా తిరుగుతుండగా ఓ వ్యక్తి వెనుక నుంచి వచ్చి నాయన సప్తగిరి పక్కకు జరుగు అనే మాట వినిపించింది. వెనుకకు చూడగా ఓ స్వామి కనిపించాడు. ఆయన వెళ్లిన తర్వాత మరో 40 మంది స్వాములు కనిపించారు. వారాంత నన్ను చూసి నవ్వారు. సప్తగిరి పేరు ఎందుకో బాగా అనిపించింది. అందుకే సప్తగిరి అనే పేరు పెట్టుకొన్నాను. బొమ్మరిల్లు భాస్కర్ ఆఫర్ సప్తగిరి పేరు పెట్టుకొన్న తర్వాత 15 రోజులకు హైదరాబాద్ వచ్చాను. బొమ్మరిల్లు భాస్కర్, శేఖర్ సూరి, చంద్ర సిద్ధార్థ తదితరుల అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాను. నేను యాక్టర్ కావడానికి కారణం బొమ్మరిల్లు భాస్కర్. బొమ్మరిల్లు చిత్రంలో చిన్న పాత్ర చేశాను. ఆ సినిమా 175 రోజులు ఆడింది. పరుగులో అవకాశం అలా బొమ్మరిల్లు తర్వాత పరుగు చిత్రంలో ఓ పాత్ర ఇచ్చాడు. కానీ నేను ఒప్పుకోలేదు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా అవకాశం ఇవ్వను అని భాస్కర్ చెప్పారు. బలవంతంగా పరుగు సినిమాలో అవకాశం లభించింది. అప్పటి నుంచి నాకు యాక్టర్లుగా ఆఫర్లు రావడం వచ్చాయి. ఆ తర్వాత హీరో అయిపోయాను. తాగినప్పుడే డ్యాన్సులు డ్యాన్సులు అనేవి కొత్తగా నేర్చుకోలేదు. నా బాడీలోనే ఆ రిథం ఉంది. చేస్తాను అనే నమ్మకం ఉండేది. చేయగలను అనే విశ్వాసం మనసులో ఉండేది. తాగినప్పుడు లేదా బీరు పుచ్చుకొన్నప్పుడు తెగ డ్యాన్సులు చేసేవాడిని. అంతేగానీ ప్రత్యేకంగా డ్యాన్సులు నేర్చుకోలేదు. పవన్ కల్యాణ్ అడగడంతో సప్తగిరి ఎక్స్‌ప్రెస్ సినిమాకు ముందు ఆ చిత్రం పేరు కాటమరాయుడు. సినిమా అదే పేరుతో 95 శాతం పూర్తయింది. ఆ సమయంలో నిర్మాత శరత్ మరార్ వచ్చి కాటమరాయుడు టైటిల్ కావాలని అడిగాడు. కానీ మేము ఒప్పుకోలేదు. ఆ తర్వాత పవన్ కల్యాణ్ మళ్లీ అడగడంతో మా నిర్మాత రవికిరణ్ ఒప్పించి టైటిల్‌ను ఇచ్చేశాం. పవన్ మానవతా మూర్తి పవన్ కల్యాణ్ అలాంటి మానవతమూరి అడిగినప్పుడు కాదనలేకపోయాను. పవన్ అంటే నాకు చాలా ఇష్టం.



# దిగ్గజాల సరసన నిలిచిన అండర్-19 కెప్టెన్!

న్యూఢిల్లీ : అండర్-19 ప్రపంచకప్ టీమిండియా కెప్టెన్ పృథ్వీషా మరో అరుదైన ఘనతను సాధించాడు. ఇప్పటి వరకు క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ, సౌతాఫ్రికా విధ్వంసకర ఆటగాడు ఏబీ డివిలియర్స్ వంటి ఆటగాళ్లతో ఒప్పందం కుదుర్చుకున్న ఎంఆర్ఎఫ్ సంస్థ తాజాగా అండర్-19 ప్రపంచకప్ కోసం పృథ్వీతో ఒప్పందం కుదుర్చుకుంది.

అయితే పృథ్వీ ఎంత మొత్తంతో ఎంఆర్ఎఫ్‌తో ఒప్పందం చేసుకున్నాడు అనే విషయంపై స్పష్టత లేదు. సాధారణంగా మైదానంలో పరుగుల వరదరపారిస్తేనే... ఎంఆర్ఎఫ్ ఏ ఆటగాడితో అయిన ఒప్పందం కుదర్చుకుంటుంది. గతంలో సచిన్ ఎంఆర్ఎఫ్ బ్యాట్‌తో పది సంవత్సరాలు ఆడాడు. అనంతరం విరాట్‌తో కూడా ఎఆర్ఎఫ్ దాదాపు రూ.100 కోట్లతో ఒప్పందం చేసుకుంది. ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం స్టీవ్ వా, శిఖర్ ధావన్ కూడా ఎంఆర్ఎఫ్ బ్యాట్‌తో ఆడి మెరుపులు మెరిపాచు. తాజాగా న్యూజిలాండ్‌లో జరిగే అండర్-19 ప్రపంచకప్‌లో పృథ్వీ ఎంఆర్ఎఫ్ బ్యాట్‌తో ఆడనున్నాడు. 2013 నవంబర్‌లో హ్యారిస్ షీల్డ్ మ్యాచ్‌లో 330 బంతుల్లో 546 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకట్టుకున్నాడు.. 2017-18 రంజీ ట్రోఫీలో ఆడిన ఆరు మ్యాచుల్లో మూడు శతకాలు చేసి 537 పరుగులు చేశాడు.

తన చిన్నతనంలో సచిన్, లారా, విరాట్ ఎంఆర్ఎఫ్ బ్యాట్‌తో ఆడటం చూశానని ఇప్పుడు తాను ఎంఆర్ఎఫ్ బ్యాట్‌తో ఆడటం చాలా సంతోషంగా ఉందని పృథ్వీ అన్నాడు.

# నేడు విశాఖలో భారత్ - శ్రీలంక వన్డే పోరు

## భారత్‌పైనే ఒత్తిడి : లంక కెప్టెన్



విశాఖపట్నం : విశాఖపట్నంలో ఆదివారం జరగనున్న సిరీస్ నిర్ణయాత్మక వన్డేలో భారత్ జట్టుపైనే ఎక్కువ ఒత్తిడి ఉంటుందని శ్రీలంక కెప్టెన్ తిసార పెరీరా అభిప్రాయపడ్డాడు. ధర్మశాల వన్డేలో ఘోర పరాజయం చవిచూసిన భారత్.. గత బుధవారం మొహాలి వేదికగా జరిగిన రెండో వన్డేలో 392 పరుగుల భారీ స్కోరు చేసి లంకేయుల్ని చిత్తుగా ఓడించిన విషయం తెలిసిందే. దీంతో మూడో వన్డేలో ఏ జట్టు పైచేయి సాధిస్తుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. జట్టు విజయావకాశాలపై శనివారం మీడియాతో తిసార పెరీరా మాట్లాడాడు.

మొహాలి, ధర్మశాలతో పోలిస్తే విశాఖపట్నం వాతావరణం చాలా భిన్నం. ఇంకా చెప్పాలంటే శ్రీలంకని పోలి ఉంటుంది. తుది వన్డే కోసం మేము చాలా కష్టపడ్డాం.

ధర్మశాల వన్డే తరహాలో మరోసారి భారత్‌పై మెరుగైన ప్రదర్శన చేయాలనే ధీమాతో ఉన్నాం. ఇప్పటికే రెండు ప్రాక్టీస్ సెషన్స్ ముగిశాయి. విజేత నిర్ణయాత్మక వన్డే అయినప్పటికీ మాపై ఎలాంటి ఒత్తిడీ లేదు. ఇది మరో మ్యాచ్‌లానే భావిస్తున్నాం.

కానీ.. భారత్ జట్టు ప్రపంచంలోని అత్యుత్తమ జట్లలో ఒకటి. కాబట్టి.. వారిపై మాత్రం తప్పకుండా ఒత్తిడి ఉంటుంది అని తిసార పెరీరా వివరించాడు.

# స్మార్ట్ సిటీల్లో ప్రపంచ స్థాయి పుణికి పుచ్చుకోవాలి

## - పీఆర్ఎస్ఐ జాతీయ సదస్సు రెండో రోజు చర్చల్లో నిపుణుల సూచన



విశాఖపట్నం : మనదేశంలోని స్మార్ట్ సిటీలు ప్రపంచ స్థాయి పుణికిపుచ్చుకోవాలి. అవి పేరుకు మాత్రమే స్మార్ట్ నిజానికి ప్రపంచ స్థాయి అభివృద్ధికి చాలా దూరంలో ఉన్నాయని వివిధ రంగాల నిపుణులు అభిప్రాయం వ్యక్త చేశారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) 39వ అఖిల భారత సమావేశాల రెండవ రోజైన శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మూడు విభాగాలుగా 'ఎమర్జింగ్ ఇండియా -స్మార్ట్ సిటీస్- స్మార్ట్ కమ్యూనికేషన్' అనే అంశంపై ఆసక్తికరమైన చర్చ జరిగింది. తొలి సెషన్‌కు ముంబయ్‌కి చెందిన యాడ్ ఫ్యాక్టర్ పీఆర్ సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి మదన్ బహ్లా సంధానకర్తగా వ్యవహరించారు. ఆయన చర్చ ప్రారంభిస్తూ 2016లో ప్రధాని మన దేశంలో 100 నగరాలను స్మార్ట్ సిటీలుగా ప్రకటించారన్నారు. గణాంకాలను బట్టి చూస్తే 2030-50 నాటికి 70 నుంచి 75 శాతం జనాభా నగరాలకు వలస పోతుందని సర్వే నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. ముంబయ్‌కి చెందిన ఆర్కిటెక్ట్, డిజైనర్ నితిన్ కిల్వాలా 'స్మార్ట్ ఐట్‌లెట్ అండ్ రిఫ్రెషింగ్ బ్రాండింగ్ ఫర్ స్మార్ట్ సిటీస్' అనే అంశంపై మాట్లాడారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ముంబయ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుబోధ్ డాక్వాలే 'సీఎస్ఆర్ ఫర్ స్మార్ట్ సిటీ' అంశంపై మాట్లాడుతూ రానున్న 40 ఏళ్లలో పెట్రోలియం ఉత్పత్తుల రంగంలో చోటు చేసుకోనున్న మార్పులకు అనుగుణంగా ఇండియన్ ఆయిల్ సంస్థ రిటైల్ ఔట్‌లెట్లు ఎంత అధునాతనంగా తీర్చిదిద్దబోతున్నామో చిత్రాలతో వివరించారు. రోబోటిక్ ఫ్యుయల్ ఫిల్లింగ్, స్మార్ట్ పేమెంట్ విధానాలు ఆయన చక్కగా వివరించారు. ఆదిత్య బిర్లా మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రసిడెంట్ డాక్టర్ ప్రగ్యాంక్ రామ్ తదితరులు ఈ చర్చలో పాల్గొన్నారు.

రెండో దశ చర్చలకు విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ ఛైర్మన్ ఎం.టి. కృష్ణ బాబు సంచాలకునిగా వ్యవహరించారు. చెన్నైకి చెందిన 'బార్క్' శాస్త్రవేత్త డానియల్ చెల్లప్ప ' స్మార్ట్ సిటీ నిర్మాణానికి వెన్నెముక సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అందరికీ పరిశుభ్రమైన తాగునీరు అందించాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించారు. సముద్ర జలాలను తాగునీరుగా మలచడం ద్వారా నీటి ఎద్దడి నివారణకు ఉపయుక్తమైన పలు సూచనలు వివరించారు. ఐటీసీ, కోల్‌కతా కార్పొరేట్ వ్యవహారాల సీనియర్ ఉపాధ్యక్షులు నజీబ్ ఆరిఫ్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీల నిర్మాణానికి అవసరమైన తాగునీరు, ఆహార ఉత్పత్తులకు భూమి కొరత తీర్చాలంటే బంజరు భూములను సాగులోకి తేవాలన్నారు. గిరిజనులు స్వయం కృషితో పెంచిన సహజమైన అడవులు, రాజస్థాన్ ఎడారులలో భూములను సాగు చేయడానికి రైతులు నిర్మించుకున్న డ్యామ్‌లు, సహజమైన నదిని తలపించే నీటి యాజమాన్య పద్ధతుల ద్వారా మూడు పంటలు పండించి అభివృద్ధి సాధించిన తీరును వీడియో ఆధారాలతో చూపించి సదస్యులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశారు. మూడవ సదస్సుకు పీఆర్ఎస్ఐ (తూర్పు) ఉపాధ్యక్షురాలు ఎమ్మెన్ మజూమ్దార్ సంచలకత్వం వహించారు. సింబియోసిస్ టెక్నాలజీస్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఓరుగంటి నరేష్ కుమార్ చర్చను ప్రారంభిస్తూ ప్రపంచంలోని ధనిక నగరాల ర్యాంకింగ్‌లో విశాఖపట్నం తొమ్మిదో స్థానంలో ఉందన్నారు. విశాఖ రైల్వేస్టేషన్ దేశంలోనే అత్యంత పరిశుభ్రమైనదిగా మొదటి ర్యాంక్ పొందింది, స్వచ్ఛభారత్ ర్యాంకింగ్‌లో నగరం తృతీయ స్థానంలో ఉంది. ఇన్ని విశిష్టతలున్న విశాఖ పీఆర్ఎస్ఐ 39వ జాతీయ సదస్సు నిర్వహణకు వేదికగా ఎంపిక చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ప్రపంచంలో అత్యంత నివాసయోగ్యమైన నగరాల జాబితాకు 200 నగరాలలో సర్వే నిర్వహించగా భారతదేశపు అత్యంత నివాసయోగ్య నగరం హైదరాబాద్ 144వ స్థానంలో ఉందంటే మనం ఏస్థాయిలో అభివృద్ధి సాధించాలో ఆయన గుర్తు చేశారు. అభివృద్ధి సోపానం మెట్రోరైలు అనే అంశంపై ఢిల్లీ మెట్రో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనూజ్ దయాళ్, సమాజిక మాధ్యమం ద్వారా సమాచార విప్లవం అనే అంశంపై అనూజ్ దయాళ్, స్మార్ట్ సిటీస్ స్మార్ట్ అడ్వర్టయిజ్‌మెంట్స్ అనే అవంశంపై హెచ్‌పీసీఎల్ ముంబాయ్ జనరల్ మేనేజర్ రాజీవ్ గోయెల్ మాట్లాడారు.

# పర్యాటక రంగంలో విశాఖను దేశంలో మొదటి స్థానంలో నిలుపుదాం

- హెలీ టూరిజంను ప్రారంభించిన ముఖ్యమంత్రి
- అత్యవసరాలకు, ట్రాన్స్‌పోర్టేషన్‌కు ఉపయోగం
- విశాఖ ఆర్థిక రాజధానిగా రాష్ట్రానికి వెన్నుముక



విశాఖపట్నం: అన్ని రంగాలలోను అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో పర్యాటక రంగాన్ని కూడా పెద్ద ఎత్తున ప్రోత్సహించి దేశంలో మొదటి స్థానంలో నిలపడానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం విశాఖజిల్లా పర్యటనలో భాగంగా ఉడా, పర్యాటకశాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెలీటూరిజం ప్రాజెక్టును ఉడాపార్కులో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెలీ టూరిజం ద్వారా దేశ విదేశీ పర్యటకులను ఆకర్షించవచ్చునన్నారు. అరకు, లంబసింగితో పాటు సిటీ మొత్తం చూసే అవకాశం కలుగుతుందని, అదేవిధంగా ఆరోగ్య అత్యవసరాలకు, ట్రాన్స్‌పోర్టేషన్‌కు ఈ టూరిజం ఉపయోగించుకోవచ్చునన్నారు. ఇటీవల అరకులో బెలూన్ ఫెస్టివల్‌ను నిర్వహించామని లంబసింగిని కేంద్రంగా చేసుకొని ఫ్లవర్‌షోలను ఏర్పాటు చేసి, కాఫీ, ఆర్గనిక్ వ్యవసాయం, వాటర్‌ఫాల్స్ పర్యాటకంగా తీర్చిదిద్దనున్నామని, విశాఖను భవిష్యత్తులో వెడ్డింగ్ డెస్టినేషన్‌కు కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దానున్నామన్నారు. ఐటి పరంగా గూగుల్ ఎక్స్, ఫిన్‌టెక్, నాలెడ్జ్ ఎకానమీకి విశాఖ అనుకూలమని, విశాఖ ఆర్థిక రాజధానిగా రాష్ట్రానికి వెన్నుముఖగా, బ్యూటీఫుల్ ఇంటర్నేషనల్ సిటీగా రూపుదిద్దుకోనున్నదన్నారు.

### గోవా కంటే సుందర సాగరతీరమిది: సీఎం

గోవా కంటే సుందరమైన సాగర తీరం విశాఖపట్నం సొంతమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. వనరులు ఉన్నా ఇంకా పర్యాటకంగా విశాఖ అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. పర్యాటక అభివృద్ధితో ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించే విధంగా విశాఖను అభివృద్ధి చేస్తామని, రాష్ట్రాభివృద్ధి కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. విశాఖను ఆర్థిక రాజధానిగా మార్చడమే లక్ష్యంగా కృషిచేస్తున్నానన్నారు. మంత్రి నారా లోకేశ్ విశాఖలో గూగుల్ ఎక్స్ కంపెనీ ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నారని ముఖ్యమంత్రి వెల్లడించారు. గూగుల్ కంపెనీ వస్తే మరిన్ని ఐటీ సంస్థలు విశాఖకు వస్తాయన్నారు . ఈ సందర్భంగా హెలీకాప్టర్లో పర్యటించడానికి వచ్చిన పర్యాటకులకు మొదటి టికెట్లను ముఖ్యమంత్రి అందజేశారు.



ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రి గంటా శ్రీనివాసరావు, పార్లమెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలం భవాని, శాసనమండలి సభ్యులు పప్పల చలపతిరావు, గాదె శ్రీనివాసరావు, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, బండారు సత్యన్నారాయణ, వాసుపల్లి గణేష్‌కుమార్, పల్లా శ్రీనివాస్, గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, వంగలపూడి అనిత, గిడ్డి ఈశ్వరి, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఉడా వీసీ బసంతకుమార్, టూరిజం ఎండి హిమాంశ్ శుక్లా, ఇడి శ్రీరాములునాయుడు, జివియంసి జోనల్ కమిషనర్ శ్రీనివాసరావు, పవన్‌హేన్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల దృష్ట్యా అలా చేశాం

## అపోలో ఛైర్మన్



చెన్నై :తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలిత మరణంపై విచారణ కమిషన్ నుంచి తమకు ఎటువంటి పిలుపు అందలేదని అపోలో గ్రూప్ ఆసుపత్రుల ఛైర్మన్ ప్రతాప్ సి. రెడ్డి శనివారం వెల్లడించారు. జయలలితను ఆసుపత్రికి తీసుకువచ్చిన సమయంలో ఆమె పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని ఆమె జ్వరంతో బాధపడుతున్నారనే ప్రకటనను ఇచ్చినట్లు వివరించారు. విచారణ కమిషన్ నుంచి పిలుపు వస్తే.. జయలలిత మరణం విషయంపై అన్ని వివరాలను ఇవ్వడానికి సిద్ధమని పేర్కొన్నారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com